డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి - 02 సంచిక - 09 మార్చి 2022 పేజీలు - 44






## ₹ 43 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్

దశల వారీగా
ఆర్.బి.కె.లకు డ్రోన్‌ల సరఫరా

వేసవి పంటలతో
అదనపు ఆదాయం





# రైతులే పంటల ప్రణాళిక రూపకర్తలు



### వ్యవసాయాభివృద్ధికి వ్యవసాయ సలహా మండళ్ళు..

### లక్ష మంది అన్నదాతల ప్రత్యక్ష భాగస్వామ్యం..

### 10,778 ఆర్‌బీకేలతో అనుసంధానం..



- ఆహార భద్రత, రైతుకు నికర ఆదాయం ఆరోగ్యకర పంటలే లక్ష్యంగా వ్యవసాయ సలహా మండళ్ళు ఏర్పాటయ్యాయి.
- వ్యవసాయ సలహా మండలి తొలిమెట్టు రైతు భరోసా కేంద్రం. గ్రామ స్థాయిలో అభ్యుదయ రైతు, సర్పంచ్, వీఏఏలు, ఎనిమిది మంది అభ్యుదయ రైతులు ఉన్నారు.
- రైతు భరోసా కేంద్రం, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాలుగంచెల పటిష్ట వ్యవస్థ పంటల మార్పిడి, మార్కెట్ అవసరాలు, స్థానిక గిరాకీ, సరఫరాల అంతరం తగ్గించడం ధ్యేయంగా పనిచేస్తున్నాయి.
- వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహకానికి దిశానిర్దేశం చేస్తున్నాయి.
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అధ్యక్షతన, రెవిన్యూ, పశుసంవర్ధక, జలవనరులు, ఇంధన శాఖ, పౌరసరఫరాల శాఖల మంత్రులు సభ్యులుగా ఏర్పడిన రాష్ట్ర వ్యవసాయ సలహా మండలిలో అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి, కమీషనర్, ఇతర అనుబంధ శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉన్నారు. పదిమంది రైతు ప్రతినిధులు ఉన్నారు.
- జిల్లా స్థాయి కమిటీకి పదిహేనేళ్ళుగా సొంతంగా వ్యవసాయం చేస్తున్న అభ్యుదయ రైతు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్ వైస్ ఛైర్మన్‌గా, వ్యవసాయశాఖ జేడీ మెంబర్ కన్వీనర్‌గా ఆ జిల్లాల ఎంపీ, ఎమ్మెల్యేలు వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మహిళా, కౌలు రైతులతో పాటు పదిమంది అభ్యుదయ రైతులు భాగస్వాములుగా ఉన్నారు.
- ఇక మండల స్థాయిలో ఎమ్మెల్యే అధ్యక్షతన ఏర్పడిన సలహా మండలికి 15 ఏళ్ళుగా సొంతంగా సాగు చేస్తున్న అభ్యుదయ రైతు నేతృత్వం వహిస్తున్నారు. అన్ని స్థాయిల్లోనూ మహిళా రైతులకు సముచిత స్థానం ఉంది.









ప్రధాన సంపాదకులు
**శ్రీ హెచ్. అరుణ్‌కుమార్,** ఐ.ఏ.ఎస్.
వ్యవసాయ కమీషనర్



సంపాదకులు
**శ్రీమతి డి. ప్రమీల**
డైరెక్టర్, ఆత్మ

కార్యనిర్వాహక సంపాదకులు
**శ్రీ. వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు
**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** డిడిఎ ఇన్‌చార్జ్
**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ
**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఎఒ

*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com


డా. వైఎస్ఆర్ రైతు భరోసా సంచిక డిజిటల్ ఎడిషన్
apagrisnet.gov.in అందుబాటులో ఉంది

## విషయసూచిక

మార్చి – 2022


సంపాదకీయం

| | | |
|---|---|---|
| 1. | రూ.43,052.78 కోట్లతో వ్యవసాయ బడ్జెట్ | 5 |
| 2. | ఎప్పటికప్పుడే పరిహారం | 7 |
| 3. | తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వండి | 8 |
| 4. | సంపూర్ణ బ్యాంకింగ్ సేవలకు ఆర్.బి.కె.లు సంసిద్ధం | 9 |
| 5. | అపరాలు, నూనె గింజల సాగుకు అపార అవకాశాలు | 10 |
| 6. | వేసవి పంటలతో అదనపు ఆదాయం | 11 |
| 7. | సజ్జ సాగులో సస్యరక్షణ | 13 |
| 8. | లోతు దుక్కులు – లాభాలు | 15 |
| 9. | ప్రత్తి తీతలో మెళకువలు | 17 |
| 10. | భూసార పరీక్ష – సాగుకు రక్ష | 19 |
| 11. | ఉద్యాన పంటలలో నులిపురుగులు | 21 |
| 12. | చిత్రమాలిక | 22 |
| 13. | మామిడి పూత నిలబెడితేనే మేలైన దిగుబడి | 24 |
| 14. | ఆరోగ్యానికి దివ్య ఔషధం మునగ | 26 |
| 15. | వేసవిలో కొత్తిమీర – లాభాలు కోరినంత మేర | 28 |
| 16. | మొక్కలపై రసాయన మందుల ప్రభావం | 30 |
| 17. | చామంతి – లాభాల విరిబంతి | 32 |
| 18. | శనగ కోత–నిల్వలో జాగ్రత్తలు | 34 |
| 19. | పట్టు పరిశ్రమలో యాంత్రీకరణ ప్రాధాన్యత – ప్రయోజనాలు | 36 |
| 20. | సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు – సమాధానాలు | 37 |
| 21. | సందేహాలు – సమాధానాలు | 39 |
| 22. | సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| 23. | సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |



డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా – రూ.300/–
యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ ఖాతా నెం. 069610100200430 కు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపవచ్చు. డి.డి.లు పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా మాసపత్రిక, వ్యవసాయ కమీషనర్ కార్యాలయం చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు




**సంపాదకీయం**

# వ్యవసాయ రంగం మరింత బలోపేతం

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంతోనే రాష్ట్ర సౌభాగ్యమమని నమ్ముతోంది. తొలి నుంచి ఆ దిశగానే అడుగులు వేస్తోంది. రైతు బాగుండాలి వ్యవసాయం వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా నమ్మి పని చేస్తోన్న ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారి కలలు వాస్తవ రూపం దాల్చుతున్నాయి. ఆయన నాయకత్వంలో ఈ దేశంలోనే మన వ్యవసాయ రంగం ఎన్నో విజయగాథలను నమోదు చేస్తోంది. కోవిడ్ కష్టకాలంలోనే కాదు, ఆరుగాలాల్లోనూ రైతు వెన్నంటి ఉండి సాయం అందించడంవల్లనే ఇది సాధ్యమైంది. వ్యవసాయాభివృద్ధిలో జాతీయాభివృద్ధి రేటు కన్నా మన రాష్ట్ర వృద్ధి రేటు అధికంగా ఉండడమే ఇందుకు ఉదాహరణ. 2021-22 లో జాతీయ స్థాయి వృద్ధి రేటు 9.8% కాగా మన రాష్ట్ర వృద్ధి రేటు 14.5 శాతంగా నమోదయింది.

ఈ స్ఫూర్తితోనే రానున్న ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మరింత అధికంగా నిధులు కేటాయించారు. రైతుల అభ్యున్నతికి, వ్యవసాయ, అనుబంధ రంగాల పురోగతికి వినూత్న విధానాలు తీసుకొస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్‌లో ప్రకటించారు. రైతుల ముంగిటే అన్ని సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తృతం చేయడంతోపాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను అనుసంధానం చేయబోతున్నారు. దీనివల్ల పంట, వ్యక్తిగత, బంగారు రుణాల మంజూరు సులభతరం కానుంది.

గడిచిన ఖరీఫ్‌లో రికార్డు స్థాయి ధాన్యం దిగుబడులు రానున్నాయని అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో రైతులకు యంత్ర సేవలను మరింత అందుబాటులోకి తేవాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీనిప్రకారం రైతులకు వ్యక్తిగత యంత్ర పరికరాలు రాయితీపై అందించాలని నిర్ణయించారు.

రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల దృష్ట్యా ఈ పథకాన్ని ఎక్కువ మంది రైతులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రివర్యుల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే స్ప్రేయర్లు, టార్పాలిన్లు వంటి పనిముట్ల పంపిణీకి కూడా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

రైతులకు తక్కువ పెట్టుబడి, నాణ్యమైన అధిక దిగుబడి లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఇందుకోసం సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక ధృవీకరణ సంస్థను ఏర్పాటు చేయనుంది. దీనివల్ల రైతుల ఉత్పత్తులకు ఎగుమతి చేసుకునే వీలు కలుగుతుంది. అంతేకాకుండా 5 లక్షల ఎకరాల్లో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అలాగే ఆధునిక పరిజ్ఞానాన్ని రైతులకు మరింత చేరువ చేసేందుకు డ్రోన్ల వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. డ్రోన్ల వల్ల ఎరువులు, పురుగు మందుల పిచికారి తేలికవుతుంది. వాటి వినియోగ పరిమాణం తగ్గుతుంది. ఫలితంగా రైతులకు పెట్టుబడి తగ్గి నికర ఆదాయం పెరుగుతుంది. విడతల వారిగా ఆర్బీకేల్లో వాటిని ప్రవేశపెట్టనున్నారు. వీటి నిర్వహణపై స్థానిక యువత కనీసం 20 వేల మందికి డ్రోన్ పైలట్ శిక్షణ ఇవ్వాలని సన్నాహాలు చేస్తున్నారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి లభించడమే కాక, నిర్వహణ తేలికవుతుంది.

వ్యవసాయానికి ఉపాధిహామీని అనుసంధానం చేయడం ద్వారా బంజరుభూములను సాగుభూములుగా మార్చుతూ పండ్ల తోటలు, మొక్కల పెంపకం, పొలం గట్లపై మొక్కలు నాటటం ప్రోత్సహించనున్నారు.

రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలు, కరవు ప్రాంతాల్లో ఒక గొప్ప మార్పు తీసుకురాగలిగిన వై.ఎస్.ఆర్. జలకళ కార్యక్రమం కింద విస్తృతంగా బోర్లు తవ్వించనుంది. అంతేకాకుండా మోటార్లు కూడా ఉచితంగా ఇవ్వడానికి బడ్జెట్లో నిధులు కేటాయించారు.

ఉద్యాన పంటల్లో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించాలని కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. గత ఏడాది కంటే రూ. 175 కోట్లు అదనంగా కేటాయించి 43,052 కోట్లతో రూపొందించిన వ్యవసాయ బడ్జెట్ రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందనడంలో సందేహం లేదు.

# రూ.43,052.78 కోట్లతో వ్యవసాయ బడ్జెట్





## గత ఏడాది కన్నా రూ.1176 కోట్లు అధికం
## ఆర్.బి.కె.లకు డ్రోన్ల సరఫరా
## సేంద్రియ ఉత్పత్తులకు ధృవీకరణ సంస్థ
## వై.ఎస్.ఆర్. జలకళ క్రింద విస్తృతంగా బోర్లు

రానున్న ఆర్థిక సంవత్సరానికి (2022-23) రూ. 43,052.78 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కురసాల కన్నబాబు గారు శాసనసభలో ఫిబ్రవరి 11న ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ఉపాధి హామీతో వ్యవసాయాన్ని అనుసంధానం చేయడానికి రూ.8,329 కోట్లు ప్రతిపాదించాం. రాష్ట్రంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో దశల వారీగా 10,000 డ్రోన్లను రాయితీపై సరఫరా చేస్తాం. వాటి నిర్వహణకు 20,000 మంది గ్రామీణ యువతకు శిక్షణ ఇస్తాం. ఆర్గానిక్ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రూ.200 కోట్లు వెచ్చిస్తాం అని చెప్పారు. ప్రసంగంలోని ముఖ్యాంశాలివి:

మన ప్రభుత్వం వచ్చిన ఈ 33 నెలల కాలంలో రైతు పక్షపాతి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు చిరునవ్వుతో వ్యవసాయ, ఇతర అనుబంధరంగాల అభివృద్ధికై సుమారు 1లక్షా 10 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన విషయాన్ని సంతృప్తితో ప్రకటిస్తున్నాం.

గత ప్రభుత్వం ఐదేళ్ళ కాలంలో రూ.15,279 కోట్ల ఋణ మాఫీ చేస్తే, ఒక్క వై.ఎస్.ఆర్. రైతు భరోసా క్రింద ఇప్పటివరకు రూ.20117.59 కోట్లు ఈ ప్రభుత్వం చెల్లించింది. దీన్నిబట్టి ఈ ప్రభుత్వం ఏ విధంగా రైతులకు సాయం చేస్తోందో సులువుగా అర్థం చేసుకోవచ్చు.

ఆర్.బి.కేలను బ్యాంకింగ్ సేవల కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నాం. ఇందుకోసం 9160 మందిని బ్యాంకింగ్ కరస్పాండెంట్లుగా నియమించాం. ఇక్కడ నుంచే రైతులు బ్యాంకింగ్ సేవలు పొందే విధానం తీసుకొచ్చాం ఆర్.బి.కేల్లో ఏ.టి.ఎమ్.లు కూడా ఏర్పాటు చేయబోతున్నాం. దశల వారిగా వీటి ఏర్పాటు జరుగుతుంది. **వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సహకార సేవలకు రైతు భరోసా కేంద్రాలను అనుసంధానం చేయబోతున్నాం.**

ఇదేకాకుండా రైతు ఋణ మంజూరులో రైతు భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషించబోతున్నాయి.

**వై.ఎస్.ఆర్. రైతు భవన్ :** రూ.52 కోట్లతో ఇప్పుడున్న జిల్లాలతో పాటు కొత్తగా ఏర్పాటయ్యే జిల్లాలలో 26 చోట్ల డా. వై.ఎస్.ఆర్. రైతు భవన్ పేరిట భవనాల నిర్మాణం చేపడతాం. ఇవి రైతుల విశ్రాంతికి ఉపయోగపడతాయి.

వ్యవసాయానికి యాంత్రీకరణ చాలా అవసరం. కూలీల లభ్యత తగ్గడం, వ్యయం పెరగడం వంటి విషయాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రభుత్వం మొదటి నుంచి యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాలు ఆర్.బి.కేలకు అనుసంధానంగా ఏర్పాటు చేయగా **ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రైతులకు వ్యక్తిగత యంత్ర పరికరాలు రాయితీపై**

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."



అందించాలని ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ నిర్ణయం తీసుకున్నారు, రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల దృష్ట్యా ఈ పథకాన్ని ఎక్కువ మంది రైతులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతున్నాం. స్ప్రేయర్లు, టార్పాలిన్లు మొదలుకొని ఏఏ పనిముట్లు కావాలో ప్రణాళిక చేస్తున్నాం.

**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు:** రైతు ఆదాయాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ఈ ప్రభుత్వం పని చేస్తోంది. పెట్టుబడి వ్యయం తగ్గించడం మొదలుకొని ఉత్పత్తుల మార్కెటింగ్ వరకు చేయూతనిచ్చి ఆదాయం పెంచే వరకు వివిధ మార్గాల్లో ఆదుకుంటున్నాం. గత ప్రభుత్వం ఐదేళ్ళ కాలంలో ధాన్యం సేకరణకు సుమారు రూ.43 వేల కోట్లు ఖర్చు చేస్తే 32 నెలల పాలనలో ఈ ప్రభుత్వం దాదాపు రూ.40 వేల కోట్లతో ధాన్యాన్ని కొనుగోలు చేసింది.

**సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణ సంస్థ:** తక్కువ పెట్టుబడి... మేలైన దిగుబడి.. అధిక రాబడి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు సాధికార సంస్థద్వారా ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం అనే కార్యక్రమం అమలు చేస్తోంది. రాష్ట్రంలో సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు ప్రకృతిసిద్ధ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణ సంస్థను ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థకు అనుబంధంగా ఇది ఏర్పాటవుతుంది. రాష్ట్రంలో ఆర్గానిక్ అగ్రి పాలసీని ముందుకు తీసుకెళ్ళడానికి ఇది తోడ్పాటునిస్తుంది. సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణకు సంబంధించి ప్రభుత్వ పరంగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయాన్ని గుర్తించి ఈ దిశగా అడుగులు వేశాం.

**'ప్రకృతి' ప్రత్యేక కమ్యూనిటీ సెంటర్లు:** అన్ని రైతు భరోసా కేంద్రాల్లోను ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన శిక్షణ, సహాయం, అందించే కేంద్రాలు ఈ ఏడాది ఏర్పాటు చేయబోతున్నాం. ఈ సంవత్సరం 5000 ఆర్.బి.కేల పరిధిలో మొదటి దశ కేంద్రాలు ఏర్పాటవుతాయి. వచ్చే ఏడాదిలో మొత్తం ఆర్.బి.కేల్లో ఇవి అందుబాటులోకి వస్తాయి.

**వ్యవసాయంలో డ్రోన్‌ల సాయం :** వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానం వినియోగం చాలా కీలకంగా మారింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు రైతులకు చేరువ చేయాలని ముఖ్యమంత్రి వర్యులు సూచించారు. అందుకు అనుగుణంగా ఈ ఏడాది వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ప్రవేశపెడుతున్నాం. పురుగుమందులు, ఎరువుల పిచికారీ నుంచి విత్తనాలు వెదజల్లే వరకు డ్రోన్లతో చేస్తే వాటి వినియోగ పరిమాణం తగ్గుతుంది. దీనివల్ల రైతులకు ఖర్చు తగ్గి అధిక నికరాదాయం పెరుగుతుంది.

**డ్రోన్ పైలెట్లకు శిక్షణ:** రాష్ట్రంలోని అన్ని ఆర్.బి.కేల్లో 10 వేల డ్రోన్‌లను దశల వారీగా రాయితీపై సరఫరా చేసి, వీటి నిర్వహణకు గ్రామీణ యువతకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇస్తాం. దీనితో గ్రామాల్లోని దాదాపు 20 వేల మంది యువతకు స్థానికంగా ఈ రంగంలో ఉపాధి కల్పించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నాం.


**వై.ఎస్.ఆర్. జలకళ:** వై.ఎస్.ఆర్. జలకళ పేరిట ఉచితంగా బోర్లను తవ్వే కార్యక్రమకాన్ని గత ఏడాది రూ.2340 కోట్ల వ్యయంతో 2 లక్షల బోర్లను తవ్వేందుకు శ్రీకారం చుట్టాం. సన్న, చిన్నకారు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దాదాపుగా రూ.1700 కోట్ల వ్యయం కాగలిగిన మోటార్లను కూడా ఉచితంగా అందించే ప్రణాళికను ముఖ్యమంత్రి గారు ప్రకటించారని మంత్రి తన ప్రసంగంలో వివరించారు.

### ప్రధాన పథకాలకు కేటాయింపులు రూ.కోట్లలో

| పథకం | కేటాయింపు |
|---|---|
| రైతుభరోసా-పి.ఎం. కిసాన్ | 7,020 |
| ఉపాధి హామీతో అనుసంధానం | 8,329 |
| వ్యవసాయ విద్యుత్ రాయితీ | 7,000 |
| ప్రకృతి విపత్తుల సహాయ నిధి | 2,000 |
| పంటల బీమా | 1,802 |
| సున్నా వడ్డీ పంట రుణాలు | 500 |
| రాయితీ విత్తనాల సరఫరా | 200 |
| పొలంబడులు | 30 |
| అగ్రి ల్యాబ్స్ | 50 |
| వై.ఎస్.ఆర్.జలకళ | 50 |
| ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు | 20 |

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# ఎప్పటికప్పుడే పరిహారం




ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్ ముగియక ముందే పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) చెల్లిస్తూ రైతన్నకు తోడుగా నిలుస్తున్నామని ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే కాకుండా ఏ రాష్ట్రంలోనూ ఇలా అన్నదాతలకు తోడుగా నిలిచిన దాఖలాలు లేవన్నారు. గత సర్కారు అండగా నిలవకపోగా పంట నష్టపోయి కష్టాల్లో ఉన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ఎగ్గొట్టి వెన్ను విరిచిందన్నారు. ఒకవేళ ఇచ్చినా ఏడాది తరువాత అరకొరగా విదిలించటాన్ని చూశామని గుర్తు చేశారు. గత సర్కారుకు, మన ప్రభుత్వానికి తేడా గమనించాలని కోరారు. గత నవంబరులో కురిసిన వర్షాలు, వరదల వల్ల జరిగిన పంట నష్టంతోపాటు నేలకోత, ఇసుక మేటల కారణంగా నష్టపోయిన 5,97,311 మంది రైతన్నలకు రూ. 542.06 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ, 1,220 రైతు గ్రూపులకు వైఎస్సార్ యంత్ర సేవాపథకం కింద రూ. 29.51 కోట్లతో కలిపి మొత్తం రూ. 571.57 కోట్లను సీఎం జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి ఫిబ్రవరి 15న బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మంత్రులు కురసాల కన్నబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎం. శంకరనారాయణ, అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య తదితరులు ఇందులో పాల్గొన్నారు. సీఎం ప్రసంగంలో ముఖ్యాంశాలు ఇవీ..

**నేడు కౌలు రైతులకూ న్యాయం :** కౌలు రైతులను గత సర్కారు ఏరోజూ గుర్తుంచుకోలేదు. కానీ ఇవాళ అర్హులెవరూ మిగిలిపోకుండా ఇ-క్రాప్ డేటాతో శాస్త్రీయంగా ఆర్బీకేల స్థాయిలోనే పంట నష్టాలను అంచనా వేసే విధానాన్ని ప్రవేశపెట్టాం. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ గ్రామ సచివాలయాల్లోనే అర్హుల జాబితాను ప్రదర్శిస్తూ ఏ సీజన్‌లో జరిగిన నష్టపరిహారాన్ని అదే సీజన్‌లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న ప్రభుత్వం మనది. కౌలు రైతులకు సైతం ఇ-క్రాప్ డేటా ఆధారంగా ఇన్‌పుట్ సబ్సిడీని అందజేస్తున్న ప్రభుత్వం కూడా ఇదే.

**అందని వారికి మరో అవకాశం :** ఇ-క్రాప్ డేటా ఆధారంగా ఏ ఒక్కరూ మిస్ కాకుండా గ్రామ స్థాయిలోనే ఆర్బీకేలలో జాబితా ప్రదర్శిస్తున్న ప్రభుత్వం మనది. ఒకవేళ ఎవరైనా మిస్ అయితే తిరిగి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ మంచి చేస్తున్నాం. పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీని కౌలు రైతులతో సహా అన్నదాతలందరికీ చెల్లిస్తున్నాం.

ఇప్పటి వరకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ. 1,612 కోట్లు మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకూ రెండున్నరేళ్ళలో ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన 19.93 లక్షల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ. 1,612 కోట్లు అందజేశాం.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వండి



**సహకార బ్యాంకులు మన బ్యాంకులు, వాటిని మనం కాపాడుకోవాలి. తక్కువ వడ్డీలకు రుణాలు వస్తాయి. దీనివల్ల ప్రజలకు, రైతులకు మేలు జరుగుతుంది. తక్కువ వడ్డీకి ఇవ్వడానికి ఎంత వెసులుబాటు ఉంటుందో అంత తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వండి. బ్యాంకింగ్ రంగంలో పోటీని ఎదుర్కొనేలా డీసీసీబీలు, సొసైటీలు ఉండాలి. ఈ పోటీని తట్టుకునేందుకు ఆకర్షణీయమైన వడ్డీరేట్లతో రుణాలు ఇవ్వండి. నాణ్యమైన రుణసదుపాయం ఉంటే బ్యాంకులు బాగా వృద్ధి చెందుతాయి. మంచి ఎస్ఓపీలను పాటించేలా చూడాలి. డీసీసీబీలు లాభాల బాట పట్టేలా చూడాలి.**

**-ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గారు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ మార్కెటింగ్, సహకారశాఖపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పనితీరు, వాటి శాఖలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పనితీరును సీఎం సమీక్షించారు. సహకార బ్యాంకుల బలోపేతంపై ఇప్పటికవరకు తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. డీసీసీబీలు సొసైటీలు బలోపేతం, కంప్యూటరైజేషన్, పారదర్శక విధానాలు, ఆర్బీకేలతో అనుసంధానం తదితర అంశాలపై కీలక చర్చ జరిపారు.

డీసీసీబీలు పటిష్టంగా ఉంటే రైతులు మేలు పొందుతారన్న సీఎం, బంగారంపై రుణాలు ఇచ్చి మిగిలిన బ్యాంకులు వ్యాపారపరంగా లబ్ధి పొందుతున్నాయి. రుణాలపై కచ్చితమైన భద్రత ఉన్నందున వాటికి మేలు చేకూరుతోంది. ఇలాంటి అవకాశాలను సహకార బ్యాంకులు కూడా సద్వినియోగం చేసుకోవాలి. వాణిజ్య బ్యాంకులు, ఇతర బ్యాంకుల కన్నా తక్కువ వడ్డీకే బంగారంపై రుణాలు ఇవ్వడం ద్వారా ఖాతాదారులను తమవైపు తిప్పుకోవచ్చు. తద్వారా అటు ఖాతాదారులకు, ఇటు సహకార బ్యాంకులకు మేలు జరుగుతుంది. వ్యవసాయ రంగంలో ఆర్బీకేల్లాంటి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. రుణాల మంజూరులో ఎక్కడా రాజీ ఉండకూడదు. రాజకీయాలకు చోటు ఉండకూడదు. అవినీతికి, సిఫార్సులకు తావు లేకుండా కేంద్ర సహకార బ్యాంకులు కార్యకలాపాలు సాగాలి. నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అన్నది చాలా ముఖ్యం. సహకార బ్యాంకుల్లో ఖాతాదారులకు విశ్వాసం కలిగించే చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) బ్యాంకింగ్ కార్యకలాపాలు ఆర్బీకేల ద్వారా సాగాలి. ఆ మేరకు పీఏసీఎస్‌లను మ్యాపింగ్ చేసి వాటి కింద వచ్చే ఆర్బీకేలను నిర్ణయించాలి. ఆర్బీకేల్లో బ్యాంకింగ్ కార్యకలాపాలను పీఏసీఎస్‌లతో అనుసంధానం చేయాలి. ఆర్బీకేలు ఆర్బీకేల్లోని బ్యాంకింగ్ కరస్పాండెంట్లు రైతులకు, బ్యాంకులకు మధ్య ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. ఈ వ్యవస్థ ఎలా ఉండాలన్న దానిపై అధికారులు బ్యాంకింగ్ నిపుణులతో మాట్లాడి ఒక విధానాన్ని రూపొందించాలన్న సీఎం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, సొసైటీల్లో చక్కటి యాజమాన్య విధానాలను తీసుకురావాలి. అంతిమంగా ప్రతి ఎకరా సాగుచేస్తున్న ప్రతి రైతుకూ మేలు జరగాలి. ఈ లక్ష్యం దిశగా సొసైటీలను నడిపించాలి. ప్రతిపాదనలను మరింత మెరుగ్గా తయారుచేసి తనకు నివేదించాలన్నారు సీఎం. వ్యవసాయ సలహామండళ్ళ సమావేశంలో బ్యాంకింగ్ రంగంపై రైతులనుంచి వచ్చే ఫిర్యాదులు, సలహాలు, సూచనలు కూడా స్వీకరించి దానిపై తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**

# సంపూర్ణ బ్యాంకింగ్ సేవలకు ఆర్.బి.కె.లు సంసిద్ధం



రాష్ట్రంలో రైతులకు బహుళార్థ సేవలు అందిస్తున్న డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రాలు ఇప్పుడు బ్యాంకింగ్ సేవలకు సిద్ధమయ్యాయి. గత జనవరి వరకు పరిమిత సేవలే అందుతున్నాయి. ఇప్పుడివి విస్తృతం కానున్నాయి. ఇందుకోసం రాష్ట్రంలోని 10,778 రైతు భరోసా కేంద్రాల్లో ఫిబ్రవరిలో 22 రోజులపాటు బ్యాంకింగ్ సేవలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆయా బ్యాంకుల స్థానిక అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొన్న ఈ అవగాహన సదస్సుల్లో దాదాపు 15 రకాల బ్యాంకింగ్ సేవలపై రైతులకు విశదీకరించారు. బ్యాంకు ఖాతా తెరవడం మొదలుకుని ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజెడీవై), పీఎం జీవనజ్యోతి భీమాయోజన, పీఎంజేజేబివై, పీఎం సామాన్య భీమాయోజన (పీ.ఎంఎస్‌బివై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా నమోదు చేయడం, బ్యాంకు సేవల్లో ఫిర్యాదులు పరిష్కారం, బ్యాంకు కరస్పాండెంట్ల సేవలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా ముఖ్యంగా బ్యాంకు అందించే రుణసేవల గురించి రైతులకు తెలియజెప్పారు. వీటిలో పంటరుణాల నుంచి భూమి అభివృద్ధి, గ్రామీణ గోదాములు, చిన్నతరహా నీటి ప్రాజెక్టులు, వ్యవసాయ యాంత్రీకరణ, పట్టు పరిశ్రమ, ఉద్యానశాఖ, పాలీహౌస్‌లు, నర్సరీల పెంపకం, పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకలు, చేపల పెంపకం వంటి వాటికి దీర్ఘకాలిక రుణాలు ఇస్తారు. అలాగే మత్స్య, పాడి పరిశ్రమ రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు సౌకర్యం కల్పిస్తారు. వేర్‌హౌస్ గోదాం రశీదును బట్టి నిల్వ ఉంచిన పంట ఉత్పత్తులకు రుణ సదుపాయం లభిస్తుంది.

జాయింట్ గ్రూపుల ద్వారా కౌలు రైతులకు రుణాలు రైతు ఉత్పత్తి సంస్థలకు రుణ సదుపాయం. వ్యవసాయ మౌలిక సదాపాయాల నిధి ద్వారా రుణ సౌకర్యం. వివిధ శాఖల ద్వారా అందించే సబ్సిడీ పథకాలకు రుణాలు ఉదా : ఉద్యానశాఖ ద్వారా ఎం.ఐ.డిహెచ్. పథకం, కిసాన్ క్రెడిట్ కార్డులు, గృహ, విద్య, వాహన రుణాలు కేంద్ర ప్రభుత్వం అందించే ఖచ్చితమైన తిరిగి చెల్లింపులకు ప్రోత్సాహం.

ఈ సేవలన్నిటితో పాటు రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం ద్వారా బ్యాంకు ఖాతాకు ఆధార్, ఎన్‌పీసీఐ లింక్ సమస్య వల్ల లబ్ధి పొందని రైతులకు ఎన్‌పీసీఐ యాక్టివ్ చేసుకునే విధానం తెలియజెప్పారు. పీఎం కిసాన్ పెండింగ్ ఆధార్ సవరణలు, స్వయం నమోదు, పరిశీలన, పీఎం ఎఫ్ఎస్ సంబంధిత కారణాల వల్ల లబ్ధి పొందని రైతులకు కూడా వాటిని సరిచేసుకునే విధానం అవగాహన కల్పించారు. అంతేకాకుండా వ్యవసాయశాఖ అందించే సున్నా వడ్డీ పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, పంటల బీమా పథకాల గురించి విస్తృత ప్రచారం చేశారు.

## ఇదీ ప్రగతి

| | | |
|---|---|---|
| మొత్తం ఆర్.బి.కె.లు | : | 10,778 |
| సదస్సుల్లో పాల్గొన్న బ్యాంకు శాఖలు | : | 1,700 |
| పంట రుణాలు పొందిన రైతులు | : | 6,100 |
| పొందిన పంట రుణాల మొత్తం | : | రూ.56.10 కోట్లు |
| దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు | : | 663 |
| పొందిన రుణాలు | : | రూ. 14.50 కోట్లు |
| గృహ, ఇతర తనఖా రుణాలు పొందినవారు | : | 558 |
| రుణాల మొత్తం | : | రు. 15.84 కోట్లు |

"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# అపరాలు, నూనె గింజల సాగుకు అపార అవకాశాలు



రాష్ట్రంలో ప్రస్తుత వేసవి పంట కాలంలో అపరాలు, నూనెగింజలు, ఇతర పంటలు విస్తారంగా పండించే అవకాశాలు అపారంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ కమీషనర్ హెచ్. అరుణ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా వాటి ఆవశ్యకతను గుర్తించిందని, మూడవ పంటగా వేసవిలో వీటిని ప్రోత్సహించడానికి జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించామని చెప్పారు. మే నెలాఖరు వరకు వేసే పంటలను వేసవి పంటలుగా పరిగణిస్తామని చెప్పారు. ఇటీవల ఈ పంట ప్రణాళిక కార్యాచరణపై ఆయన ఆధ్వర్యంలో ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయ పరిశోధన సంచాలకుల, ప్రధాన శాస్త్రవేత్తలు, ఆత్మ, సమేతి డైరక్టర్లు, జేడీలు ఇతర ఉన్నతాధికారులతో వెబ్ఎక్స్ విస్తృత సమావేశం జరిగింది. మినుములో పీయు 37, టిబిజి 104 రకాలు, పెసర ఐపీయు 2-14 రకం, నువ్వుల్లో యలమంచిలి రకాలు అనుకూలంగా ఉంటాయని విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు చెప్పారు.

వేరుశనగలో కదిరి, లేపాక్షి రకం ఎక్కువ గింజల కాయలతో అధిక దిగుబడిని ఇస్తుందని, బెట్టను తట్టుకుంటుందని నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త డా. కె.ఎస్.ఎస్. నాయక్ పేర్కొన్నారు. చిరుధాన్యాల శాస్త్రవేత్త డా. హేమంత్ కుమార్ మాట్లాడుతూ రాగి, సజ్జ, జొన్నలో తక్కువకాల పరిమితి గల రకాలు అనుకూలమని తెలిపారు.

రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి శ్రీకాకుళం జిల్లాలో నూనె గింజల సాగుకు అవకాశాలున్నాయని రైతులను చైతన్యపరిచి సాగు విస్తీర్ణం పెంచేలా చూడాలని వ్యవసాయ కమీషనర్ సూచించారు. మిగిలిన జిల్లాల జేడీలు కూడా ఈ దిశగా దృష్టి సారించాలన్నారు. విశాఖ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో 90 శాతం సబ్సిడీపై విత్తనం ఇచ్చే అంశం పరిశీలించాలని విశాఖ డీడీ కోరారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద 50 శాతం సబ్సిడీ ఇస్తున్నందున మిగిలిన 40 శాతం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. నెల్లూరు జిల్లాలో మరింత సాగు విస్తరణకు అవకాశాలున్నాయని పరిశీలించాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 8.52 లక్షల హెక్టార్లలో సాగుకు అనుకూలమైన విస్తరణ ప్రణాళికలు రూపొందించాలని విస్తరణ సంచాలకులు పేర్కొన్నారు.

రైతు భరోసా కేంద్రాల నుంచి అవసరమైన విత్తనాల ఇండెంట్ ప్రతిపాదనలు తీసుకుని ఏపీ సీడ్స్ నుంచి విత్తనాలు సరఫరా చేసేలా సమాయత్తం చేయాలని కమీషనర్ నిర్దేశించారు. ఐసీసీ సమన్వయంతో వేసవి పంటల సాగుపై ఆడియో, వీడియోల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. అంతేకాకుండా ఈ పంటకాలంలో సరైన సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు చొరవ చూపి తగు సూచనలు, సలహాలు ఇస్తే అధిక దిగుబడులు వస్తాయని కమీషనర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# వేసవి పంటలతో అదనపు ఆదాయం

రబీ పంటల కోత అనంతరం సాధారణంగా రైతులు భూమిని వేసవి కాలంలో ఖాళీగా ఉంచేస్తుంటారు. దీనివలన వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలకు నేలలోని పోషకాల లభ్యత సూక్ష్మజీవుల ప్రక్రియ తగ్గి తద్వారా నేల ఆరోగ్యం దెబ్బ తింటుందని పరిశోధన ఫలితాలు తెలుపుతున్నాయి. అంతేకాకుండా అధిక గాలులు అకాల వర్షాల వలన నేల కోతకు గురవుతుంది. ఈ పరిస్థితులలో వేసవి కాలంలో నేలను ఖాళీగా ఉంచడంకన్నా ఏదైనా పంటతో ఆచ్ఛాదన కల్పించి నట్లయితే అధిక ఆదాయంతో పాటు నేల ఆరోగ్యాన్ని సంరక్షించవచ్చు. నీటి వసతి ఉన్న రైతులు వేసవి కాలంలో క్రింద తెలపబడిన పంటలు మరియు వాటి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం వలన అధిక దిగబడులు పొందవచ్చును.

మన రాష్ట్రంలో వేసవిలో పెసర, మినుము అలసంద పంటలను ఫిబ్రవరి నుండి మార్చి 15వ తేది వరకు విత్తుకోవచ్చు. వరిమాగాణుల్లో మార్చి చివరి వరకు విత్తుకోవచ్చు. ఈ పంటలలో నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవడం ముఖ్యమైన అంశం, అలాగే సరైన విత్తన మోతాదు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి.

**విత్తనశుద్ధి :** కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 5 గ్రా. కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే సుమారు 15 నుండి 20 రోజుల వరకు రసంపీల్చే పురుగుల బారి నుండి పంటను రక్షించుకోవచ్చు.

**కలుపునివారణ :** పెండిమిథాలిన్ 30% ద్రావకం ఎకరాకు 1.3 నుండి 1.6 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 24-48 గంటలలోపు భూమిలో తేమ ఉన్నప్పుడు పిచికారి చేయాలి. పంట వయసు 20-25 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేయాలి. పైరు విత్తిన 20 రోజులప్పుడు వెడల్పాకు కలుపు నివారణకు ఎకరాకు ఇమాజితాఫిర్ 200 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. గడ్డిజాతి కలుపు నివారణకు క్విజాలోఫాప్ఇథైల్ 400 మి.లీ. మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**యాజమాన్య పద్ధతులు**

| పంటలు | రకాలు | పంటకాలం (రోజులలో) | విత్తనమోతాదు (కేజి/ఎ.) | విత్తే దూరం |
|---|---|---|---|---|
| పెసలు | పెసర ఎల్.జి.జి-407, ఎల్.జి.జి-460, ఎల్.జి.జి-450, ఎల్.జి.జి-410 | 65-70 | మెట్ట ప్రాంతం (6-7)<br>వరి మాగాణి (10-12) | వరుసల మధ్య 30 సెం.మీ మరియు వరుసలో మొక్కల మధ్య 10 సెం.మీ |
| | టి.ఎం. 96-2, ఐ.పి.యం.-2-14 | 60-65 | | |
| | డబ్ల్యు.జి.జి-42 | 55-60 | | |
| మినుము | ఎల్.బి.జి-752, ఎల్.బిజి-787 | 75-80 | ఆరుతడి (10-12)<br>మాగాణి (16-18) | వరుసల మధ్య 22.5 సెం.మీ మరియు వరుసలో మొక్కల మధ్య 10 సెం.మీ |
| | టి.బి.జి-104, పి.యు-31 | 70-75 | | |

**నీటి యాజమాన్యం :** వాతావరణ ఉష్ణోగ్రతలను నేల స్వభావంబట్టి 5-7 రోజులకు ఒక నీటితడి ఇవ్వాలి. పంట వయసు 25-30 రోజులు 45-50 రోజుల దశలను కీలక దశలుగా గుర్తించి నీటితడులు ఇవ్వాలి.

**ఎరువులయాజమాన్యం :** ఆఖరి దుక్కిలో ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులను వేసుకోవాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."



### సస్యరక్షణ :

వేసవిలో పొడి వాతావరణం వలన రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేక థయోమిథాక్సామ్ 0.2 గ్రా. ఏదైన ఒకదానిని ఒకలీటరు నీటికి చొప్పున కలిపి ఉధృతిని బట్టి మందును మార్చి మార్చి వారం నుంచి 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

### చిత్తపురుగులు :

ఈ పురుగులు పంట రెండాకుల దశలో ఆశించి చిన్నచిన్న గుండ్రటి రంధ్రాలను చేస్తాయి. ఈ పురుగుల వలన మొదటి దశలోనే పంట నష్టం జరిగే అవకాశం ఉంది. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

### బూడిదతెగులు :

విత్తిన 30-35 రోజుల తర్వాత గాలిలో తేమ వాతావరణం ఎక్కువగా ఉన్నపుడు బూడిద తెగులుకు అనుకూలం. తెగులు నివారణకు హెక్సకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ 1.0 మి.లీ లేదా మైక్లోబుటానిల్ 1.0 గ్రా. లేదా కార్బెండిజిమ్ 1 గ్రా. లేదా థయోఫానేట్మిథైల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

### పల్లాకుతెగులు :

పల్లాకు తెగులు ముఖ్యంగా తెల్లదోమ వలన వ్యాప్తి చెందుతుంది. తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. ఏదైనా ఒకదానిని లీటరు నీటికి చొప్పున కలిపి తెల్లదోమ ఉధృతిని బట్టి మందును మార్చిమార్చి వారం నుంచి 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.



**డా. కె. అశోక్ కుమార్,** సీనియర్ శాస్త్రవేత్త (వ్యవసాయ వాతావరణ విభాగం), **డా. జి.డి. ఉమాదేవి,** రీసెర్చ్ అసోసియేట్ (వ్యవసాయ వాతావరణ విభాగం), **కె.వి.యస్. సుధీర్,** శాస్త్రవేత్త (వ్యవసాయ వాతావరణ విభాగం), **డా. బి. సహదేవరెడ్డి,** ప్రధాన శాస్త్రవేత్త అధిపతి, వ్యవసాయ పరిశోధన స్థానం, అనంతపురం

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# సజ్జ సాగులో సస్యరక్షణ



చిరుధాన్యాల్లో అధిక ఉష్ణోగ్రతకు తక్కువ భూసారానికి తట్టుకొని నిలదొక్కుకొనే శక్తి సజ్జ పంటకు ఉంది. అందుకే చాలా మంది రైతులు సజ్జ పంటను వర్షాధార పంటగా ఖరీఫ్ కాలంలో వేసవి కాలంలో నీటి పారుదల క్రింద సాగుచేస్తారు. సజ్జ సాగులో కొన్ని ముఖ్యమైన పురుగులు తెగుళ్ళు ఆశించడం వలన ఎక్కువ నష్టం కలుగుతుంది. వీటిని సరైన సమయంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే మంచి దిగుబడులను పొందవచ్చును. అందువల్ల ఈ పంటను ఆశించిన ముఖ్యమైన తెగుళ్ళు మరియు వాటి నివారణ చర్యలు గురించి వివరించడమైనది.

## పురుగులు

**మొవ్వు ఈగ :** ఈ పురుగు విత్తినప్పటి నుండి 30 రోజుల వరకు మాత్రమే పైరును ఆశిస్తుంది. మొవ్వులోని భాగాన్ని గోకి తినటం వల్ల మొవ్వు వాడి చనిపోతుంది. ఎండిన మొవ్వు పీకగానే సులువుగా వస్తుంది. మొవ్వు మొదలుకుళ్లి ఉండటం వల్ల చెడు వాసన వస్తుంది. పురుగు ఆశించిన మొక్క చనిపోయి దాని మొదలు వద్ద గుబురుగా పిలకలు వస్తాయి. పిలకలకు కంకులు రావు. ఈ పురుగులు జొన్న మరియు ఇతర చిరుధాన్యాల పంటలను ఆశిస్తాయి.

**యాజమాన్యం :** ఆలస్యంగా విత్తిన పైరుకు ఎక్కువగా నష్టాన్ని కలుగచేస్తుంది. అందువల్ల వర్షాలు రాగానే పదును బట్టి ఖరీఫ్ సీజనులో జూలై 15 లోపలనే విత్తుకోవాలి. ఆలస్యంగా విత్తనం వేయాల్సి వస్తే విత్తన మోతాదును 4 నుండి 10 కిలోలకు పెంచి మొవ్వు ఈగ ఆశించిన మొక్కలను తీసివేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నచోట్ల కార్బోఫ్యూరాన్ గుళికలను ఎకరాకు 4 కిలోలను విత్తేటప్పుడు సాళ్ళలో పోయాలి. మొక్క మొలిచిన 7, 14 మరియు 21 రోజులకు థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**కాండం తొలుచు పురుగు :** ఈ పురుగు పంటను 30 రోజుల తర్వాత నుండి అన్ని దశలలో ఆశిస్తుంది. గుడ్ల నుండి బయటకు వచ్చిన పిల్ల పురుగులు వెంటనే మొవ్వు దగ్గర గుమిగూడి మొవ్వు నుండి బయటకు వస్తున్న లేత ఆకులను తింటాయి. గుండ్రని వరుసలలో రంధ్రాలు ఆకులపై పెడతాయి. పిల్ల పురుగులు 2-3 దశలలో ఎదిగినప్పుడు కాండం లోనికి తొలుచుకొని పోయి మొవ్వును కొరికి తింటాయి. కంకులు ఏర్పడిన తర్వాత కంకి తొడిమలను ఆశించటం వల్ల కంకులు విరిగి మొవ్వు చనిపోతుంది. ఈ పురుగు మొక్కజొన్న, జొన్న, రాగి పంటలను ఆశిస్తుంది.

**యాజమాన్యం :** పంటకోత తర్వాత పొలాన్ని బాగా లోతుగా దున్ని పంట అవశేషాలను కాల్చివేయాలి. ట్రైకోగ్రామా ఖిలోనిస్ పరాన్నజీవి గుడ్లను ఎకరాకు 1 ట్రైకోకార్డ్ రూపంతో రెండు విడతలుగా విడుదల చేయాలి. విత్తిన 35-40 రోజులలోపు ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను కాండపు సుడుల్లో వేయాలి.

**కత్తెర పురుగు :** లద్దె పురుగు తొలి దశల్లో ఆకులలోని పత్ర హరితాన్ని తింటూ, ఆకులను జల్లెడలా మారుస్తాయి. తరువాత దశల్లో మొవ్వు దగ్గర ఆకు సుడులలో చేరి లేత ఆకులను తినేసి, ఆకులకు రంధ్రాలు చేసి తీవ్ర నష్టం కలిగిస్తుంది. కంకిని ఆశించి గింజలను తినివేస్తుంది. ఈ పురుగులు మొక్కజొన్న, జొన్న మరియు రాగి పంటలను ఆశిస్తుంది.

**యాజమాన్యం :** కిలో విత్తనానికి 4 మి.లీ. ఫోర్టెంజా (సయాంట్రనిల్‌ప్రోల్ 19.8 + థయోమిథాక్సామ్ 19.8%)తో విత్తనశుద్ధి చేసుకోవాలి. కాండం తొలిచే కత్తెర పురుగు నివారణకు ట్రైకోగ్రామా ప్రిటియోసం పరాన్నజీవి గుడ్లని ఎకరాకు 2-3 ట్రైకోకార్డ్ రూపంలో రెండు విడతలుగా 12వ మరియు 22వ రోజు పైరు దశలో విడుదల చేయాలి. పెరిగిన దశలైన (3 నుండి 6వ దశ) లార్వా నివారణకు, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాను నియంత్రించుటకు 10 కిలోల తౌడు, 2 కిలోల బెల్లం, 2 లీటర్ల నీటిలో 100 గ్రా.ల థయోడికార్బ్‌ను కలిపి ఎరను తయారు చేసుకొని మొక్క సుడుల్లో వేయాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

**పచ్చ కంకి పురుగు :** ఈ పురుగులు కంకి పొట్ట నుండి బయటకు రాగానే ఆశిస్తాయి. పురుగులు కంకులను ఆశించి రసాన్ని పీలుస్తాయి. ఇవి వృద్ధి చెందుతున్న విత్తనాలను మాత్రమే ఆశిస్తాయి. కంకి ఏర్పడుతున్న దశలో ఆశించినట్లయితే కంకిలో గింజలు ఏర్పడవు. గింజలు పాలు పోసుకునే దశలో కనుక ఈ పురుగు ఆశించినట్లయితే కంకిలో గింజలు తాలుగా మారి ముడుచుకొని పోవును.

**యాజమాన్యం :** అవసరాన్ని బట్టి క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## తెగుళ్ళు

**పచ్చకంకి / వెర్రి కంకి తెగులు / బూజు తెగులు :** మొదటగా లేత మొక్కలు మూడు నుంచి నాలుగు ఆకులు వేసే దశలో కనిపిస్తాయి. తెగులు సోకిన మొక్కల ఆకులు పసుపు రంగుకి మారుతాయి. గాలిలో తేమ అధికంగా ఉన్న వాతావరణంలో ఆకుల అడుగు భాగాన తెల్లని బూజు పెరుగుదల కనిపిస్తుంది. తీవ్రంగా తెగులు సోకిన మొక్కలు గిడసబారి ముప్పై రోజుల లోపు చనిపోతాయి. తెగులు సోకిన మొక్కలలో కంకులు పూర్తిగా లేదా పాక్షికంగా ఆకుపచ్చని ఆకులు మాదిరిగా మారిపోతాయి.

**యాజమాన్యం :** నాణ్యమైన మరియు ఆరోగ్యకరమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి. తెగుళ్ళను తట్టుకునే రకాలను సాగుచేసుకోవాలి. ఐ.సి.టి.పి. 8203, ఐ.సి.యం.వి. 221, రాజ్ 171, హెచ్.హెచ్.బి. 67, హెచ్.హెచ్.బి. 121, ఐ.సి.యమ్.హెచ్. 356, పి.హెచ్. 3, ఎ.బి.వి. 04.

**విత్తనశుద్ధి :** తెగులు ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో విత్తన శుద్ధి చేసుకోవాలి. 6 గ్రా. మెటలాక్సిన్ (ఆప్రాన్) ఒక కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. పంటకాలంలో కనుక ఈ తెగులు ఆశించినట్టు గమనిస్తే 2 గ్రా. మెటలాక్సిల్ లీటరు నీటికి కలిపి నాటిన 30 రోజుల నుండి పిచికారీ చేసుకోవాలి. విత్తిన పంటలో కంటే నాటిన పంటలో ఈ తెగులు ఉధృతి తక్కువగా వుంటుంది. తెగులు ఆశించిన మొక్కలను పంట అవశేషాలను కాల్చి నాశనం చేయాలి. వేసవిలో లోతు దుక్కిలు చేసుకోవడం శిలీంద్ర అవశేషాలను నాశనం చేయవచ్చు.

**కొమ్ము తెగులు / ఎర్గాట్ తెగులు / తేనెబంక తెగులు:** తెగులు లక్షణాలు పుష్పించే దశనుండి కనిపిస్తాయి. తెగులు సోకిన కంకుల నుండి గులాబి లేదా ఎరుపు రంగు తీయని జిగురు వంటి ద్రవం కారటం గమనించవచ్చు. ఈ ద్రవంలో శిలీంద్ర బీజాలు ఏర్పడతాయి. ఈ ద్రవం మొక్కల పైభాగంలోని ఆకులపై చుక్కలుగా కారి ఆకులు జిగటతో నిండి వుంటాయి. 10-15 రోజులలో ఈ చుక్కలు ఎండి ముదురు గోధుమ రంగులో వున్న గట్టి స్క్లిరోషియా కొమ్ములుగా మారుతాయి. ఇవి మామూలు గింజలకంటే పరిమాణంలోపెద్దవిగా వుండి చివర్లు మొనదేలి వుంటాయి.

**యాజమాన్యం :** వర్షాలు పడే సమయానికి పూతదశ పూర్తి అయ్యే విధముగా విత్తే సమయాన్ని ముందుకు సవరించుకోవాలి. విత్తనాలను పదిశాతం ఉప్పునీటి ద్రావణంలో ముంచి విత్తనాలతో కలిసిన స్క్లీరోషియాలను వేరుచేయాలి. పొలంలోని కలుపు మొక్కలను నిర్మూలించుకోవాలి. పంటకాలంలో ఈ తెగులు ఆశించినప్పుడు కార్బండాజిమ్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా థైరామ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పూత దశలో పిచికారీ చేసుకోవాలి. తెగులును తట్టుకొనే రకాలను సాగుచేసుకోవాలి.

**కాటుక తెగులు :** సజ్జ కంకులలో గింజలు ఏర్పడే సమయంలో తెగులు కనిపిస్తుంది. కంకిలోని కొన్ని పూలు తెగులుకు లోనై పెద్ద అండాకారపు సంచులుగా మారతాయి. ఈ సంచులలో నల్లని పొడిలాంటి శిలీంద్ర బీజాల సముదాయాలు ఏర్పడతాయి. ఇవి మామూలు గింజలకంటే పెద్దవిగా ఆకుపచ్చ రంగులో వుండి పక్వానికి వచ్చిన దశలో ముదురు గోధుమ లేక నలుపు రంగులోనికి మారుతాయి. ఈ తెగులు ఆశించడం వలన గింజ నాణ్యత మరియు బరువు తగ్గుతుంది.

**యాజమాన్యం :** తెగులు సోకిన కంకులను మరియు మొక్కలను నాశనం చెయ్యాలి. విత్తనాన్ని కాప్టాన్ లేదా థైరామ్ 3 గ్రా. కిలో విత్తనానికి పట్టించి విత్తుకోవాలి. పంటకాలంలో ఈ తెగులు ఆశించినప్పుడు జీనెబ్ 2 గ్రా.లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

---

**టి.యం. హేమలత,** శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం), **ఎల్. మాధవీలత,** సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం), **యం. హేమంత్ కుమార్,** ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి (మొక్కల ప్రజనన శాస్త్రం), **బి. వజంత,** సీనియర్ శాస్త్రవేత్త (మృత్తికా శాస్త్రం), **యన్.వి. సరళ,** సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం), **యం. శాంతి ప్రియ,** ప్రధాన శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం), వ్యవసాయ పరిశోధన స్థానము, పెరుమాళ్ళపల్లె

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# లోతు దుక్కులు - లాభాలు



వేసవి (ఏప్రిల్-మే) నెలల్లో అడపాదడపా కురిసే వానలను సద్వినియోగపరచుకొని మాగాణి భూములను, మెట్ట భూములను, బీడు భూములను దున్నుకోవాలి. వీటినే వేసవి దుక్కులు అంటారు. వీటివలన చాలా లాభాలున్నాయి.

వేసవి దుక్కులు దున్నే ముందుగానే భూమిలో పశువుల ఎరువు గానీ, కంపోస్టు గానీ, నేల స్వభావమును బట్టి చెరువు మట్టి గాని సమానంగా వెదజల్లి దున్నడం వలన నేల సారవంతమవ్వడమే గాకుండా, భూమిలో తేమ నిలువ చేసుకునే శక్తి కూడా పెరుగుతుంది.

వేసవి దుక్కులు ముందుగా పొలంలో ఆవుల మందలు గానీ, గొర్రెలు లేదా మేకల మందలు గానీ వదలటం వల్ల అవి విసర్జించే మలమూత్రాలు భూమిలోనికి చేరి, భూసారమభివృద్ధి చెందుతుంది.

వేసవిలో దుక్కులను లోతుగా చేయటం వలన భూమిలోపల గట్టి పొరలు విడిపోయి, గుల్లబారటం వలన, భూమికి నీరు నిల్వవుంచుకునే శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా, సూక్ష్మజీవుల సంతతి, వానపాముల సంతతి అభివృద్ధి అవుతాయి. తద్వారా సేంద్రీయ పదార్థం తొందరగా పెరిగి భూసారం అభివృద్ధి అవుతుంది. ఏ పంట నుండి అయినా ఆశించినంత దిగుబడిని పొందాలంటే సరైన సమయంలో విత్తుకోవాలి. వేసవి దుక్కులను చేసుకొని భూమిని తయారు చేసుకున్నపుడే విత్తనాన్ని అదునులో విత్తడానికి అవకాశముంటుంది. వానలు పడినపుడు భూమి ఎక్కువ నీరు నిల్వ చేసుకోవడం వలన మొలక శాతం కూడా ఆశించినంత వుండును.

వేసవి దుక్కుల వలన కలుపు మొక్కలు నాశనమవుతాయి. కలుపు మొక్కలు భూసారాన్ని గ్రహించడమే గాకుండా, పరోక్షంగా చీడపీడలకు ఆశ్రయమిచ్చి పంటలకు నష్టాన్ని కలుగజేస్తాయి. వేసవి దుక్కుల వలన నేలలో పాతుకుపోయిన సమస్యాత్మక కలుపు మొక్కలు, ముఖ్యంగా తుంగ, గడ్డి ఎండ తీవ్రతకు నశిస్తాయి. ఎండ తాకిడి వల్ల వాటి తాలూకు విత్తనాలు లేదా గింజలు నశించిపోవడం వల్ల పంటలో కలుపు బెడద తక్కువగా వుంటుంది.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."



కలుపు యాజమాన్యంపై పెట్టే ఖర్చు కూడా తగ్గడానికి అవకాశముంటుంది.

పంటలను ఆశించే రకరకాల పురుగులు పంటకోత దశలో వాటి నిద్రావస్థ దశలను నేలలో గాని, ఎండు ఆకులలో గాని, కొయ్య కాడలలో గాని ప్యూపాలుగా వుంటాయి. ఇందులో ముఖ్యమైనవి పొగాకు లద్దె పురుగు, పచ్చ పురుగు, రబ్బరు పురుగు, వేరుపురుగు, దాసరి పురుగు మొదలైనవి. ఈ మధ్యనే ప్రత్తిలో ఉధృతమైన గులాబి రంగు కాయతొలుచు పురుగు కూడా ముఖ్యమైనది. ఈ వేసవి దుక్కుల వలన నిద్రావస్థ దశలో ఉన్న లార్వాలు, ప్యూపాలు భూమిలోపల నుండి బయటపడతాయి. వాటిని పక్షులు ఏరుకొని తినటం వల్ల, తరువాత వేసే పంటలో ఈ పురుగుల బెడద తగ్గుతుంది.

కేవలం పురుగులే కాకుండా, వివిధ రకాల తెగుళ్ళు కూడా పంటను ఆశించి అపారమైన నష్టాన్ని కలుగజేస్తాయి. వేరు కుళ్ళు, కాండంకుళ్ళు, నారుకుళ్ళు తెగుళ్ళు ముఖ్యమైనవి. వీటి శిలీంధ్ర బీజాలు భూమిలో నిల్వ వుంటాయి. వేసవి దుక్కులను చేసినపుడు శిలీంధ్ర బీజాలు నేలపైకి రావడం వల్ల ఇవి ఎండ వేడిమికి గురై వ్యాధిని కలుగజేసే శక్తిని కోల్పోతాయి. తద్వారా పంటను తెగుళ్ళు బారి నుండి కాపాడుకోవచ్చును.

వేసవి దుక్కులను లోతుగా చేసినపుడు, భూమిలోపల గట్టి పొరలు విడిపోయి, నీరును ఎక్కువగా గ్రహించడం వల్ల పంట కొంతవరకు బెట్ట పరిస్థితులను ఎదుర్కోవడానికి వీలుంటుంది. అంతేకాకుండా, మొక్కల వేర్లు భూమి లోపలి పొరలకు చొచ్చుకొని పోయి, లోపలి పొరల నుంచి నీరు, పోషకాలు గ్రహించే అవకాశం కలుగుతుంది.

క్షారత్వం ఎక్కువగా వున్న భూములలో నేల లోపలి పొరలు గట్టిపడి మురుగు నీరు పోయే సౌకర్యం తగ్గిపోతుంది. వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల ఈ గట్టి పొరలు విడిపోయి, క్షార లవణాలు క్రింది పొరలలోనికి జారిపోయే అవకాశం ఏర్పడుతుంది.

## వేసవి దుక్కులు చేసేటపుడు పాటించవలసిన జాగ్రత్తలు:

1. వేసవిలో వాలుకు అడ్డంగా లోతుగా దున్నాలి. వాలుకు అనుకూలంగా దున్నితే నేలకోతకు గురి అయి, సారవంతమైన మట్టి కొట్టుకొని పోతుంది. వాలుకు అడ్డంగా దున్నడం వల్ల వర్షపు నీరు భూమిలోనికి బాగా ఇంకిపోవడమే కాకుండా, క్రమేణా వాలు కూడా తగ్గడానికి అవకాశముంటుంది.

2 వేసవి వర్షాలు పడిన వెంటనే పొలాన్ని దుక్కి దున్నడానికి ప్రత్యేకమైన పనిముట్లనే వాడాలి. కల్టివేటర్ భూమిని కేవలం 5 నుండి 10 సెం.మీ. లోతు వరకు మాత్రమే దున్నడం వలన మంచి నాణ్యమైన దుక్కి తయారు కాదు. మంచి నాణ్యమైన దుక్కి కొరకు, వీలును బట్టి రెక్క నాగలి లేదా పళ్ళెపు నాగలి, డిస్క్ టిల్లరు లేదా రోటవేటరు లేదా ఛిజిల్ ప్లవ్ కాని వాడాలి.

వేసవిలో లోతైన దుక్కులు దున్నటం వలన పొందగలిగే బహువిధాలైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అమలు చేసినపుడే, సకాలంలో పంటలను విత్తుకొని, భూమిలో తేమను నిల్వ చేసుకొని భూ సారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడి సాధించడానికి వీలుంటుంది.





**డా. యం. వెంకటరాములు, డా. ఎ. లలిత, డా. ఎ.మనోజ్, డా. కె.యస్. పూర్ణిమ,**
శాస్త్రవేత్తలు, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# ప్రత్తి తీత - మెళకువలు



సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే (6.00 హె.) ఈ సంవత్సరం ప్రత్తి విస్తీర్ణం (5.10 హె.) కొంతమేర తగ్గినప్పటికీ, గులాబి రంగు పురుగు ఉధృతి తక్కువగా ఉండటం, మార్కెట్‌లో పంటకు మంచి ధర లభిస్తుండటంతో ప్రత్తి రైతులందరూ ఆశావహ దృక్పథంలో ఉన్నారు. ప్రత్తితీత అనేది యాజమాన్య క్రియలో అన్నింటికంటే అధిక ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. కూలీల కొరత కారణంగా సుమారు పెట్టుబడి ఖర్చులో 20 శాతం వరకూ తీతలకే కేటాయించవలసి వస్తోంది. ఇతర దేశాలలో ప్రత్తితీతలు భారీ యంత్రాల సహాయంతోనే చేస్తున్నారు. మనదేశంలోని అన్ని ప్రాంతాలలో కూడా ప్రత్తిని చేతితో తీస్తున్నారు. తీతలకు అనువైన యంత్ర పరికరాల రూపకల్పన జరుగుతున్నది. స్వల్ప వ్యవధిలోనే మన దేశీయ పరిస్థితులకు అనువైన చిన్నచిన్న ప్రత్తి తీసే పరికరాలు అందుబాటులోనికి రావడానికి అవకాశం ఉన్నది. కాకపోతే యంత్ర సహాయంతో తీసిన ప్రత్తిలో వ్యర్థ పదార్థాలు ఎక్కువగా ఉండటం, వాని నిర్మూలనకు జిన్నింగ్ మిల్లులలో శుద్ధి చేసే పరికరాలను అమర్చుకోవలసి ఉంటుంది. చేతితో తీసిన ప్రత్తిలో వ్యర్థ పదార్థాల సమస్య ఉండదు.

మన దేశంలో ప్రత్తి సుమారు 11 మి.హె.లలో పండిస్తూ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తూ ప్రత్తి వాణిజ్య పంటగా అలరారుతోంది. ప్రత్తి పండించే రైతులలో 50 శాతం మంది చిన్న మరియు సన్నకారు రైతులే. ప్రత్తి తీసే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించం ద్వారా నాణ్యమైన ప్రత్తిని పొందవచ్చు. కేవలం తీతలోనే కాకుండా ప్రత్తి సాగులోని ప్రతి అంశము దూది నాణ్యతను నిర్ధారిస్తుంది. మన రాష్ట్రంలో ప్రత్తి సుమారు 75%-80% వర్షాధారంగా పండిస్తున్నారు. మంచి విత్తన ఎంపిక, సక్రమమైన ఎరువుల యాజమాన్యం, సూక్ష్మపోషక లోపాల నివారణ, తగు సమయాలలో పోటాషియం నైట్రేట్, యూరియాల పైపాటు పిచికారీ, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం, తీత సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం, గులాబీ రంగు పురుగుకు సమగ్ర యాజమాన్య ప్రణాళికను పాటించడం ద్వారా నాణ్యమైన ప్రత్తిని తీయటానికి అవకాశం ఉంది.

## ప్రత్తి తీతలలో తీసుకొనవలసిన జాగ్రత్తలు :

ప్రత్తి కాయలు పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాతే ప్రత్తి తీయాలి. కాయలు మంచుతో కానీ, వర్షానికి తడిసినపుడు కానీ ప్రత్తి తీయరాదు. పూర్తిగా విచ్చుకున్న కాయల నుండి ప్రత్తిని సేకరించాలి. ఖాళీ ఎరువుల సంచులను ప్రత్తి తీతలకు వాడితే, వాటి నుండి దారాలు ఊడి ప్రత్తితో కలిసి స్పిన్నింగ్ మిల్లులలో సమస్యలు ఏర్పడతాయి. కేవలం గుడ్డ సంచి లేదా గోనె సంచులను మాత్రమే తీతలకు వాడాలి. ప్రత్తి తీసేటప్పుడు ఎండిన ఆకు ముక్కలు, కాయ భాగాలు, పూల రెక్కలు పడకుండా జాగ్రత్తపడాలి. పురుగు, తెగుళ్ళు ఆశించిన కాయల నుండి తీసి ప్రత్తిని మంచి ప్రత్తితో కలుపరాదు. మొక్క క్రింది భాగంలో ఉన్న కాయల నుండి మొదట ప్రత్తి తీయాలి. తద్వారా పై కాయల నుండి వ్యర్థాలు ఎండిన ఆకులను నిరోధించవచ్చు. ప్రత్తిలో తేమ 12% కంటే తక్కువగా ఉండేటట్లు చూసుకోవాలి. తేమ శాతం ఎక్కువగా ఉన్నట్లయితే, కాడ పెరిగి విత్తనాన్ని మరియు దూదిని పాడు చేస్తుంది. ప్రత్తి తీసేటప్పుడు, తీసిన

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

ప్రత్తిని అంతా ఒక టార్పాలిన్ పట్టా మీద గానీ, గోనె పట్టా మీద గానీ పొలంలో ఒక మూల కుప్పగా చేయాలి. ఎట్టి పరిస్థితులలోనూ దుమ్ము, ధూళి పడకుండా జాగ్రత్త పడాలి. ప్రత్తిని తరువాత నీడలో ఆరబెట్టాలి. ఎండలో ఆరబెట్టినట్లయితే ప్రత్తి పసుపు రంగుకు మారి, నాణ్యత తగ్గుతుంది. పూర్తిగా ఆరిన తరువాత పొడిగా ఉన్న ప్రదేశంలో కుప్ప వేసి దేనితోనైనా కప్పివేయాలి.

## ఇలా చేయాలి...

తూకం వేసే ముందు ప్రత్తి మీద నీళ్ళు చల్లరాదు. వివిధ రకాల నుండి తీసిన ప్రత్తిని కలుపరాదు. కొన్ని రకాల ప్రత్తి అధిక నాణ్యత కలిగి ఉంటుంది. అటువంటి వాటిని తక్కువ నాణ్యత గల రకాల నుండి తీసిన ప్రత్తిని కలిపితే మొత్తం నాణ్యత తగ్గి, మంచి ధర పలకదు. రంగు మారిన, పక్వానిక రాని కాయలు, ఎండు ఆకులు, ఇసుక, పుల్లల వంటి వ్యర్థాలను రైతు స్థాయిలోనే తీసివేయాలి. ప్రత్తిని రవాణా చేసేటప్పుడు, ప్రత్తిని పూర్తిగా కప్పి ఎండకు, వానకూ తడవకుండా తీసుకెళ్ళాలి.

## గులాబి రంగు పురుగు నివారణకు ప్రత్తితీతల తరువాత తీసుకోవలసిన చర్యలు :

ఎటువంటి పరిస్థితులలోనూ పంటను పొడిగించరాదు. 150-160 రోజులకు పూర్తిచేసి ఎండిన మోళ్ళను హెడ్డర్ నడిపి, చిన్నచిన్న ముక్కలు చేసి నేలలో కలియదున్నాలి. ప్రత్తి మోళ్ళను పొలంలో గాని, ఇంటి వద్ద కానీ మేటవేసి వంటచెరకుగా వాడేందుకు నిల్వ చేయకూడదు. పంట తీసిన తరువాత చేలో గొర్రెలను, మేకలను మేపాలి. పురుగు ఆశించిన ప్రత్తిని ఇళ్ళ వద్ద నిల్వ చేయకూడదు. జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు కూడా శ్రద్ధ వహించి జిన్నింగ్ తర్వాత వచ్చే పురుగు ఆశించిన దూది విత్తనాలను నాశనం చేయాలి. లింగాకర్షక బుట్టలను విధిగా మిల్లులలో అమర్చి మగ పురుగులను ఆకర్షించి నాశనం చేయాలి. గులాబి రంగు పురుగు ఎక్కువగా ఆశించిన ప్రాంతాల నుండి ప్రత్తిని కానీ, విత్తనాన్ని వినియోగించడం కోసం తరలించకూడదు.

ఈవిధంగా తీతలలోనూ, తీతల అనంతరం కొద్దిపాటి మెళకువలను పాటించి నాణ్యమైన ప్రత్తి తీసి మంచి ధరను పొందవచ్చు. ప్రత్తి పరిశ్రమకు కూడా నాణ్యమైన ప్రత్తిని అందించినవారూ కావచ్చు.

---

**డా. ఎం. సుధారాణి,** ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), **డా. ఎన్. వెంకట లక్ష్మి,** శాస్త్రవేత్త (సస్య విభాగం), **డా. బి. శ్రీలక్ష్మి,** ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్ళ విభాగం). **డా. ఎ. దయానా గ్రేస్,** శాస్త్రవేత్త (కీటక విభాగం), **డా. బి. శ్రీకాంత్,** శాస్త్రవేత్త (జీవ ప్రక్రియ విభాగం), **శివారెడ్డి,** శాస్త్రవేత్త (ప్రజనన విభాగం), **డా. సిహెచ్. రాణి,** శాస్త్రవేత్త (ప్రజనన విభాగం)



"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



# భూసార పరీక్ష – సాగుకు రక్ష

రైతులు భూసార, సాగు నీటి పరీక్షలను తప్పని సరిగా చేసుకుని, నేల స్వభావాన్ని బట్టి సాగులో తీసుకోవాల్సిన తగిన యాజమాన్య పద్ధతులను పాటిస్తేనే సాగు ఖర్చు తగ్గించుకుని నికరాదాయం పెరుగుతుంది. భూసార మరియు సాగు నీటి పరీక్ష పత్రాన్ని రైతులు జాగ్రత్తగా గమనించుకుని పంటల సాగులో తగిన యాజమాన్య పద్ధతులను పాటించాలి.

## భూసార పరీక్షల ప్రాముఖ్యత

**నేల స్వభావం :** నేలలో బంక మన్ను, ఒండ్రు, ఇసుక కణాల శాతం ఉజ్జాయింపుగా ఏ పాళ్లలో ఉన్నాయో సూచించడానికి నేల స్వభావ నిర్ధారణ తోడ్పడుతుంది. నేల భౌతిక లక్షణాలను బట్టి, మురుగు నీరు సమస్య ఉన్న నల్ల నేలల్లో మురుగు నీటికి ప్రత్యేకమైన వ్యవస్థ ఏర్పరుచుకోవటం, విధిగా సేంద్రియ ఎరువులను వాడుకోవడం మంచి పద్ధతి. అలాగే ఇసుక శాతాన్ని పెంచటానికి శాశ్వత ప్రాతిపదికన వీలైన చోట ఇసుక కూడా నేలకు అందించుకోవచ్చు. ఇసుక ఎక్కువగా ఉన్న నేలలో నీరు త్వరగా ఇంకి పోయే నేలల్లో సారవంతమైన చెరువు మట్టిని తోలుకుని కొంత వరకూ ఆ సమస్యని పరిష్కరించుకోవచ్చు.

| నెం. | నేలలో ఉదజని సూచిక (pH) | వర్గీకరణ |
|---|---|---|
| 1 | 6.59 కన్నా తక్కువ | ఆమ్ల |
| 2 | 6.60–7.39 | తటస్థం |
| 3 | 7.40–7.89 | అల్ప క్షారం |
| 4 | 7.9–8.40 | మధ్య క్షారం |
| 5 | 8.40 కన్నా ఎక్కువ | అధిక క్షారం |

(కారు చౌడు)

**ఉదజని సూచిక :** ఉదజని సూచిక నేల సారాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. నేల ఆమ్ల, క్షార, తటస్థ గుణాలను ఉదజని సూచిక తెలియజేస్తుంది.

ఉదజని సూచికను 7.0కు దగ్గరగా ఉంచడం వ్యవసాయంలో చాలా ముఖ్యమైనది. ఎప్పటికప్పుడు నేలకు సేంద్రియ పదార్థం వేసిగానీ లేదా పచ్చి రొట్ట పైరు పెంచి కలియదున్ని గాని ఉదజని సూచికని తటస్థ పరచుకోవాలి

**లవణ సూచిక (EC):** నేలలో ఉన్నటువంటి నీటిలో కరిగే లవణ పరిమాణాన్ని ఈ లవణ సూచిక ద్వారా తెలుసుకోవచ్చును.

| వ. సం. | లవణ పరిమాణం (డెసి సీమెన్స్ /మీ.) | | | వర్గీకరణ |
|---|---|---|---|---|
| | తేలిక నేలలు | మధ్యస్థ నేలలు | బరువు నేలలు | |
| 1 | 1.00 వరకు | 1.59 వరకు | 2.00 వరకు | సామాన్యం |
| 2 | 1.01–3.00 | 1.60–4.50 | 2.01–6.00 | మొలకెత్తుట కష్టం |
| 3 | 3.00 కన్నా ఎక్కువ | 4.50 కన్నా ఎక్కువ | 6.00 కన్నా ఎక్కువ | అన్ని పైర్లకు హాని |

**సేంద్రియ కర్బనం :**

నేలలోని సూక్ష్మజీవులకు సేంద్రియ పదార్థమే ఆహారం. వాటి జీవన క్రియలలో భాగంగా సేంద్రియ పదార్థాన్ని కుళ్ళించే ప్రక్రియలో హ్యూమస్ ఏర్పడుతుంది. నేలలో భూసార పరీక్షల ద్వారా సేంద్రియ పదార్థం తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు ఎకరానికి 4 టన్నులు, మధ్యస్థ స్థాయిలో ఉన్నప్పుడు ఎకరానికి 2.5 టన్నులుసేంద్రియ ఎరువులు వేసుకోవాలి.

| వ.సం. | స్థాయి | సేంద్రియ కర్బన పరిధి(%) |
|---|---|---|
| 1 | తక్కువ | 0.50 వరకు |
| 2 | మధ్యస్థం | 0.60–0.75 |
| 3 | ఎక్కువ | 0.75 కన్నా ఎక్కువ |

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా లభ్య పోషకాల (నత్రజని, భాస్వరం, పోటాష్,సల్ఫర్ ) స్థాయిని (కి.గ్రా/ఎకరాకు) క్రింది పట్టికలో సూచించిన విధంగా వర్గీకరిస్తారు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

| వ.సం. | స్థాయి | నత్రజని | భాస్వరం | పొటాష్ | సల్ఫర్ |
|---|---|---|---|---|---|
| 1 | తక్కువ | 112 వరకు | 10 వరకు | 58 వరకు | 1-10 వరకు |
| 2 | మధ్యస్థం | 113-224 వరకు | 11-24 | 59-136 | 11-15 |
| 3 | ఎక్కువ | 224 కన్నా ఎక్కువ | 24 కన్నా ఎక్కువ | 136 కన్నా ఎక్కువ | 15 కన్నా ఎక్కువ |

భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా లభ్య సూక్ష్మ పోషకాల (జింకు, ఇనుము, మాంగనీస్, రాగి) క్లిష్ట స్థాయిని (పి.పి.ఎం. లలో) క్రింద పట్టికలో సూచించిన విధంగా వర్గీకరిస్తారు

నేలలో లభ్య పోషకాల స్థాయి తక్కువగా ఉన్నప్పుడు పంటలకు సిఫార్సు చేసిన పోషకాల సాధారణ మోతాదును30 శాతం పెంచి వేసుకోవాలి. లభ్యపోషకాలు స్థాయి ఎక్కువగా ఉంటే సిఫార్సు చేసిన సాధారణ మోతాదును 30 శాతం తగ్గించుకుని వేసుకోవాలి



## సాగు నీటి పరీక్షలు- ప్రాముఖ్యత

భూసార పరీక్ష కేంద్రంలో విశ్లేషించి నీటి నమూనాల నాణ్యతను నిర్ధారించడం జరుగుతుంది. తద్వారా రైతులకు సాగుకోసం ఎంతవరకు అనుకూలమో అర్ధమవుతుంది. పూర్తిగా నాణ్యత లోపించి, పనికిరానివిగా నిర్ధారించిన నీటిని తప్ప, మిగిలిన తరగతులకు చెందిన నీటిని సాధ్యమైనంత అధికంగా వినియోగించుకోవటానికి రైతులు వేయబోయే పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకుని, తగిన యాజమాన్య పద్ధతులను చేబడితే సరియైన దిగుబడులు పొందవచ్చు. భూసార పరీక్ష ప్రయోగ శాలలో ఉదజని సూచిక, లవణ పరిమాణ సూచిక, కార్బొనేట్, బైకార్బొనేట్, క్లోరైడ్, సల్ఫేట్, కాల్షియం, మెగ్నీషియం, సోడియం, బోరాన్ పరిమాణాలను నిర్ధారించి వాటి అనుగుణంగా సాగు నీటి నాణ్యతను తెలియజేయటం జరుగుతుంది. ఈ విధంగా నాణ్యతకు సంబంధించిన వివిధ అంశాలను తెలుసుకోవటం ఎంతైనా అవసరం.

1. ఉదజని సూచిక 6.5- 7.5 గల నీరు సాగుకు ఉత్తమ మైనది.
2. లవణ పరిమాణ సూచిక (ఎలక్ట్రికల్ కండక్టవిటి): ఇది నీటిలో కరిగివుండే మొత్తం లవణాల పరిమాణాన్ని తెలుసుకోవడానికి ఉపయోగ పడుతుంది. సాధారణంగా దీనిని డెసి సీమన్స్ / మీటర్ లలో సూచిస్తారు. లవణాల పరిమాణం స్థాయి కన్నా అధికమయ్యేకొద్దీ నీటి నాణ్యత తగ్గుతుంది.

## సాగు నీటి లవణ పరిమాణ పట్టిక :

| లవణ పరిమాణం (డెసి సీమెన్స్ /మీటరు) | ఉపయోగకరమైన నాణ్యత |
|---|---|
| <2 | వ్యవసాయానికి మంచినీరు |
| 2-4 | సాగుకు కొన్ని యాజమాన్య పద్ధతుల ద్వారా వినియోగించవచ్చు |
| >4 | పనికి రాదు |

3. సోడియం ధాతువుకు, కాల్షియం మెగ్నీషియం ధాతువులకు మధ్యగల సారూప్య నిష్పత్తి (సోడియం అబ్జార్షన్ రేషియో ): ఇది నీటిలో గల క్షారతీవ్రతను సూచిస్తుంది. సోడియం పెరిగే కొద్దీ క్షార ప్రభావం పెరుగుతుంది. కాల్షియం, మెగ్నీషియం పెరిగే కొద్దీ క్షారప్రభావం తగ్గుతుంది. వీటి నిష్పత్తిని లెక్కకట్టి తెలుసుకోవచ్చును. నిష్పత్తి పెరిగే కొద్దీ క్షార ప్రభావం పెరుగు తుంది. అయితే నాణ్యత నిర్ధారణకు నీటిలోవుండే లవణ పరిమాణాన్ని కూడా అన్వయించుకోవాలి. సోడియం అబ్జార్షన్ రేషియో వివిధ తరగతులు గా విభ్జించి చూస్తే యస్ 1 నీటికి ఇది 10 కన్నా తక్కువగానూ, యస్ 2 నీటికి 10-18 గానూ, యస్ 3 నీటికి 18-26 వరకూ, యస్ 4 నీటికి 26 పైన ఉంటుంది. ఇందులో యస్1 మరియు యస్2 నీటి తరగతులు వ్యవసాయానికి యోగ్యమైనవి.



డా. పి. వెంకట సుబ్బయ్య, సీనియర్ శాస్త్రవేత్త, సాయిల్ సైన్స్, ఉప్పునీటి పరిశోధనా స్థానం, బాపట్ల

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# ఉద్యాన పంటలలో నులిపురుగులు



నులిపురుగులు ప్రధానంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు. 1) స్వేచ్ఛా జీవులు (పరాన్న భుక్తులతో కలిసి), 2) హానికారక పరాన్న జీవులు. రెండో రకానికి చెందిన అంత: పరాన్న జీవులు చాలా ప్రమాదకరమైనవి. ఎందుకంటే ఇవి మొక్క నాళికా కణజాలాన్ని మార్చివేసి మొక్క నుండి నీటిని పోషకాలను సంగ్రహిస్తాయి.

**పంట నష్టం :** ఈ నులి పురుగుల వలన ఒక సంవత్సరం నుండి నాలుగు సంవత్సరముల తోటలలో 60-100 శాతం మరియు నర్సరీలలో నైతే 90-100 శాతం వరకు నష్టం వాటిల్లుతుంది.

**నివారణ చర్యలు :** నులి పురుగులు లేనివిగా నిర్ధారించబడిన నర్సరీల నుంచి మాత్రమే ఆరోగ్యవంతమైన జామ అంట్లను కొనుగోలు చేయాలి. అంట్లు కట్టడానికి మరియు నర్సరీలలో అంటు మొక్కలను పెంచడానికి నులి పురుగులు లేని స్వచ్ఛమైన మట్టిని వాడుకోవాలి. ఆకులు పచ్చబారి, వాడిపోయి వేరుపై బుడిపెలు లాంటివి కలిగి వున్న మొక్కలను తోటలో నాటరాదు.

**నర్సరీలో :** ఒక టన్ను మట్టిలో 50-100 కిలోల వేప పిండి లేదా గానుగ పిండి మరియు జీవ నియంత్రణ కారకాలైన పర్పురియోసిల్లమ్ నిలాసినస్, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌య మరియు ట్రైకోడెర్మా హర్జియానమ్ ఒక్కో కిలో చొప్పున కలిపిన మట్టిని అంట్లు కట్టే మందుసంచుల్లో నింపాలి. కార్బోఫ్యూరాన్ 3జి లేదా ఫోరేట్ 10జి 5 కిలోలను ఒక టన్ను మట్టికి కలపాలి. నారుమడులను, నారు మొక్కలను పెంచడానికి వాడే మట్టిని వేసవి కాలంలో తెల్ల పాలిథిన్ (25μ) షీట్‌తో (45-60 రోజులు) కప్పి వుంచి సోలరైజేషన్ ప్రక్రియ ద్వారా నులి పురుగులను నివారించవచ్చు. డయాజోమెట్ గుళికలు ఎకరాకు 60 కిలోల చొప్పున వేసి, కలియ బెట్టి పాలిథిన్ షీటుతో కప్పి, ఒక వారం వుంచి తర్వాత షీటుని తీసి, మట్టిని తిరిగి కలియబెట్టి 2-3 రోజుల తర్వాత మొక్కలను నాటుకోవాలి. ఈ పద్ధతి ద్వారా నులి పురుగులను త్వరితగతిలో నివారించవచ్చు. వీలైనంత వరకు ఎయిర్ లేయరింగ్ పద్ధతిలో నులి పురుగులు లేని మట్టి లేదా కొబ్బరిపీచు లేదా వర్మిక్యులైట్‌ని వాడి అంట్లను తయారుచేసుకోవాలి.

వేసవిలో లోతుగా దుక్కులు దున్ని మట్టిని కలియబెట్టాలి. కొత్తగా జామ తోటలు వేసే ముందు మట్టిని నులిపురుగులకై పరీక్ష చేయించుకోవాలి. నులిపురుగులు ఉన్న భూమిలో మొక్కలు నాటే ముందు జీవనియంత్రణ కారకాలతో సమృద్ధి చేయబడిన వానపాముల ఎరువు/వేపపిండి గుంటకి 5 కిలోల చొప్పున వేసుకొని అంట్లని నాటాలి. ఒక టన్ను వానపాముల ఎరువు/ పశువుల ఎరువు/ వేప పిండిలో 5 కిలోల చొప్పున పర్ప్యూరి యోసిల్లమ్ లిలాసినమ్, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ మరియు ట్రైకోడెర్మా హర్జినియమ్ కలిపి 30 రోజులు ఉంచి సమృద్ధి చేసిన మిశ్రమాన్ని 3-4 కిలోలు ఒక చెట్టుకు చొప4న 6 నెలల వ్యవధిలో వేయాలి. పైన సూచించిన జీవనియంత్రణ కారకాలతో వున్న వేపపిండి లేదా పశువుల ఎరువును 20 కిలోలను 200 లీటర్ల నీటిలో 2 రోజుల పాటు నానబెట్టి లీటర్లతో ఒక్కో చెట్టు పాదను తడిపి నులి పురుగులను నివారించవచ్చు. ఈ ద్రావణాన్ని వడకట్టి 15-20 రోజుల వ్యవధిలో డ్రిప్ పద్ధతిలో చెట్లకు పంపించడం ద్వారా నులి పురుగులను నియంత్రించవచ్చు. జామ మొక్క మొదళ్ళలో బంతి నారు మొక్కలు నాటడం ద్వారా నులి పురుగులను నివారించవచ్చు. కార్బోఫ్యూరాన్ లేదా ఫోరేట్ గుళికలను ఒక్కో చెట్టుకు 100 గ్రా. చొప్పున ఇసుకలో కలిపి సంవత్సరానికి రెండుసార్లు వేసుకోవాలి. ఫ్యూయన్ సల్ఫోన్, వయస్సును బట్టి ఒక్కో చెట్టుకు 15-30 గ్రా. చొప్పున ఇసుకలో కలిపి సంవత్సరానికి రెండు సార్లు వేసుకోవాలి. నెలకు తక్కువగా నీటితడి ఇవ్వాలి.

**డా. సిహెచ్.ఎస్. కిషోర్ కుమార్, డా. జి. రామానందం, డా. కె. మమత, డా. ఆర్. నాగలక్ష్మి, డా. కె. రవీంద్రకుమార్, డా. ఎ. స్నేహలత రాణి,** ఉద్యాన పరిశోధనా స్థానం, కొవ్వూరు,

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**




సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన



పంటల మార్పిడి ఆవశ్యకతపై చర్చ



ఎలుకల నివారణపై విజయనగరం జిల్లాలో అవగాహన




రైతు భరోసా కేంద్రంలో రైతులు, అధికారులతో సమావేశం



వ్యవసాయ ఉపకరణాల పంపిణీ



శ్రీకాకుళం జిల్లాలో రైతు సంచార విజ్ఞానం

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



అధికారులు, రైతులతో కమీషనర్ మాటా-మంతి



యంత్రసేవా లబ్ధిపై కమీషనర్ అరుణ్‌కుమార్ అవగాహన





పంటల ప్రణాళికపై జిల్లా స్థాయి సమాలోచన



ఆర్.బి.కె. ఇన్‌చార్జ్‌ల అగ్రి ల్యాబ్స్ సందర్శన



వ్యవసాయానికి దన్ను - యంత్ర పరికరాల పంపిణీ

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# మామిడి పూత నిలబెడితేనే మేలైన దిగుబడి

మామిడి మన రాష్ట్రంలో పండించే పండ్ల తోటలలో ముఖ్యమైనది. ఆంధ్రప్రదేశ్‌లో పండించే వివిధ మామిడి రకాలలో సువర్ణరేఖ, బంగినపల్లి, చెరుకురసం, కేసరి మరియు తోతాపురి రకాలు వివిధ దేశాలకు ఎగుమతి కూడా ఎగుమతి అవుతున్నాయి. అంతటి విలువైన "మామిడి పంటను" మనం ఎటువంటి యాజమాన్య పద్ధతులను పాటించి మేలైన దిగుబడులను సాధించాలి.

రైతు సోదరులు మామిడి తోటలలో చీడ-పీడల ఉధృతి అధికం కాకుండా ఉండాలి అంటే ముందుగానే జూన్-జులై మాసాలలో ప్రతి చెట్టుకు సుమారు 1.5 - 2 మీ.ల దూరంలో పాదులు చేసి వేయవలసి ఉంటుంది. జీవన ఎరువులు అయిన అజోస్పైరిల్లం 250 గ్రా. మరియు ఫాస్ఫేట్ సాల్యుబల్ ఫాస్ఫో - బ్యాక్టీరియా పొడిని 100 గ్రా.ని 100 కిలోల పశువుల ఎరువులతో పాటు వేప పిండిని 10 కిలోలు కూడా కలిపి ప్రతి చెట్టుకు వేయడం వలన భూమి సారవంతముగాను, చెట్టు సూక్ష్మధాతువుల లోపములు లేకుండా ఉంటాయి. తోటలలో అధికంగా జీవన ఎరువులు వాడిన, పవువుల ఎరువులు వాడిన తోటలలో కాయలు నిల్వ, తీపి శాతం అధికంగా ఉండటాన్ని గమనించటం జరిగింది.

ప్రస్తుతం ఈ మాసంలో తోటలను ఒక్కసారిగా శుభ్రం చేసుకొని కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. తోటలను శుభ్రంగా ఉంచటం వలన చీడ-పీడల బెడద తగ్గుతుంది.

**మామిడి తోటలలో క్రొత్త ఆకులు రావటం :** తోటలలో 25% కంటే అధికంగా క్రొత్త చిగురులు గమనించిన సైకోసిల్ 200 పి.పి.ఎం. 1-2 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. దీనివలన చిగురు ఆకులు రాలిపోవటం తగ్గిపోతుంది. పూమొగ్గలు వచ్చి బుడిపెల రూపంలో ఉంటే 19-19-19 లేదా 20-20-20 10 గ్రా. దానితో పాటు జింక్ 2 గ్రా. మరియు బోరాన్ 2 గ్రా. చొప్పున 1 లీటరు నీటికి కలిపి పిచికారి చేసిన పూత మొగ్గలు బయటకు రావటానికి అధిక అవకాశం ఉంటుంది. అంతేకాక జింక్, బోరాన్ పిచికారి చేసుకున్న ఎడల ఆడపూత శాతం పెరిగి, పిందెకట్టడం కూడా అధికంగా ఉంటుంది.

**పక్షి కన్ను తెగులు (పూత మాడు తెగులు) :** వాతావరణంలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు, తోటలలో లేత ఆకులు, చిగురు కొమ్మలపైన ఉండే ఆకారం '0'లో లేదా గుండ్రటి చల్లు 'o' లేదా నల్ల మచ్చలు గమనించిన పురుగు మందులతో పాటు కార్బండిజమ్ 1 గ్రా + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా థయోఫినేట్ మిథైల్ 1 గ్రా. లేదా క్లోరోథేలోనిల్ 2 గ్రా / లీటరు నీటికి కలిపి చల్లవచ్చును.

**బూడిద తెగులు :** వాతా వరణంలో రాత్రి చలి ఎక్కువగాను, పగలు వేడి వాతావరణం ఉండి గాలిలో తేమ శాతం తక్కువగా ఉన్నఎడల బూడిద తెగులు ఆశించ టానికి అవకాశం అధికంగా ఉంటుంది. ఈ తెగులు ఆశించిన పూత మాడిపోవడం మరియు పిందె పసుపు రంగుకు మారి రాలిపోవటం గమనించ వచ్చును. బూడిద తెగులు మరియు పక్షి కన్ను తెగులు మనం తోటలలో గమనిం చిన హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ లేదా ప్రోపినాబ్ 2 గ్రా./లీ. కాని మనం పిచికారి చేసుకోవాలి.



**వెర్రితెగులు :** మామిడిలో వచ్చే మరో తెగులు వెర్రితెగులు. కొమ్మల చివరలు ముద్దగా ఉండి, పుష్పగుచ్ఛములు పొట్టిగాను, ముద్దగాను పిందెశాతం చాలా తక్కువగాను ఉంటుంది.

నివారణకు : చిన్న మొక్కలలో అయితే కొమ్మలను కత్తిరించి, ఆరోగ్యకరమైన చెట్లు మొక్కల నుండి సేకరించిన కొమ్మలను ఈ మొక్క కొమ్మలపై అంటుకట్టుకోవటం ద్వారా ఈ వెర్రి తెగులును అరికట్టవచ్చును. మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కార్బండిజమ్ 1.0 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా./లీ. నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**మంగు :** మామిడిలో మంగు రెండు రకాలు : 1) మసి మంగు, 2) రాతి మంగు

**మసి మంగు :** కాప్నోడియం శిలీంద్రము ఆశించటం వలన వస్తుంది. ఈ మసిమంగు కారణం అయిన శిలీంద్రము రసం పీల్చే పురుగుల వలన ఆకులపైన, కాయలపైన పడిన తీయని జిగురు వంటి పదార్ధముపై పెరుగుతుంది. దీనివలన కాయ నాణ్యత మరియు మార్కెట్ విలువ తగ్గుతుంది.

నివారణ : కాపర్ ఆక్సీక్లోరైడ్ - 3 గ్రా./లీ. నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేకాకుండా రసం పీల్చే పురుగులైన హోపర్స్,

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

తామర పురుగులు, పిండినల్లి మొదలగు వాని నివారణ ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ. లేక డైమిథోయేట్ 2 మి.లీ./లీ. కాని మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి

**రాతి మంగు :** ఇది త్రిప్స్ (తామర పురుగలు) చిన్న పిందెలను గోకి తినటం వలన మంగు కాయలపై వస్తుంది. కాయల నాణ్యత దెబ్బ తింటుంది.

**నివారణ :** రాతి మంగుకు కారణం అయిన త్రిప్స్ నివారణకు పినోనిల్ 2 మి.లీ./లీ. లేక స్పినోడాడ్ 1 మి.లీ. లేక స్పినోటెట్రామేట్ లేక థైమిథాక్సిన్ 0.5 మి,..లీ. కాని స్ప్రే చేసుకొని తామర పురుగును నివారించుకోవాలి. సేంద్రియ వ్యవసాయం చేసేవారు వేప నూనె 1500 గ్రా. 5 మి.లీ./లీ. లేక పొంగామియా సోప్ 1.5 మి.లీ. / లీ. కాని 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**నల్లమచ్చ తెగులు :** మామిడిలో ముఖ్యంగా బంగినపల్లి రకాలలో నల్లమచ్చ తెగులు '△' ఆకారంలో కాని, '◻' ఆకారంలో కాని నల్ల మచ్చలు ఈనెల మధ్య భాగంలో ఉండి ఆకు రాలటం అధికంగా ఉంటుంది. ఈ తెగులు సాధారణంగా జనవరి–మార్చి నెలలలో అధికంగా ఉండి పూత, పిందె రాలటం కాయలపై మచ్చలు రావటం, జిగురు కారటం అవుతున్నాయి. కాబట్టి బంగినపల్లి చెట్లు ఉన్న రైతులు C.O.C. 3g లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 30 గ్రా / 10 లీ. నీటికి కలిపి దానితో పాటు ఆగ్రోనియమన: / స్ట్రెప్టోమైసిన్ / యాంటిబైటిక్ 3–4 గ్రా. కలిపి స్ప్రే చేసుకోవాలి. దీనివలన ఆకులలోను, కొమ్మలలోను ఉన్న శిలీంద్రములు మరియు బ్యాక్టీరియా నివారించుకోవచ్చును.



చిన్న మొక్కల్లోను, పెద్ద చెట్లలో గూడా మొదట నుండి ఎర్రని జిగురు కారటం గమనించటం జరిగినది. పైన కొమ్మలు ఎండిపోవటం, చెట్లు వడలిపోయి చనిపోవటం మనం చూస్తున్నాము. నివారణకు, C.O.C. 3g / lit. నీటికి కలిపి ముంపుగా చెట్టు మొదలు, బేరియస్ మరియు కొమ్మ, రెమ్మలు తడపాలి. ఇట్లా ప్రతి 20 రోజులకు ఒకసారి చేయవలసి ఉంటుంది. దీనితోపాటు సూక్ష్మధాతు మిశ్రమాలను + పొటాష్ + 5 గ్రా / లీ. చొప్పున పిచికారి చేసుకోవాలి.

**అకాల వర్షాలు వచ్చినప్పుడు..** అకాల వర్షాలు పూత, పిందె సమయంలో వస్తే పూత, కాయ రాలటానికి అవకాశం ఉంది. పూత దశలో వర్షం తరువాత కాయ మచ్చతెగులు లేదా పూత మాడు తెగులు లేదా రసం పీల్చు పురుగుల ఉధృతి అధికం అవటం కాని గమనించవచ్చును. ఆయా పురుగులను, తెగుళ్ళను బట్టి మందులను పిచికారి చేసుకోవాలి. ఆయ వృద్ధి జరిగే సమయంలో వర్షం పడిన కాయ త్వరగా పెరగటానికి మరియు కాయ తొడిమ బిగవటానికి అవకాశం ఉంటుంది.

## మామిడి కాయల నాణ్యత పెంచుకోవటానికి..

మామిడి కాయలు పెద్ద నిమ్మకాయ 3 గ్రా. నుండి 100 గ్రా. ఉన్నప్పుడు బ్రౌన్ కవర్స్ తొడిగిన కాయ నాణ్యత పెరుగుతుంది. కాయలను ఆశించు పురుగులు, తెగుళ్ళు నుండి నిరోధించవచ్చు. కవర్స్ తొడగటానికి ముందుగా మల్టీ–కె లేదా 19–19–19 / 20–20–20 5 గ్రా / లీ. నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. వాని వలన కాయ రంగు, నాణ్యత పెరుగుతాయి.

**మామిడి కాయ కోసిన తర్వాత..** కాయలు కోతకు ముందుగా 20–25 రోజుల ముందు నీరు కట్టటం ఆపివేయాలి. కాయలు పక్వానికి వచ్చిన తరువాత మాత్రమే కాయలను చల్లని సమయంలో కాయ కోత పరికరము వాడి కాయలను కోసుకోవాలి. కోసిన తరువాత కాయలు సొనకారి పోవటానికి కాయలను తలక్రిందులుగా వెదురు మంచెలు/ స్టాండ్ ఏర్పాటు చేసుకొని కాయలను బోర్లించి ఉంచాలి.

కాయలను ట్రేలలో పెట్టి ప్లాస్టిక్ ట్రేలతో సహా 5% సోడియం హైపో ద్రావణంలో ముంచి శుద్ధి చేసుకోవాలి. కాయలను ఆరిన పిదప 10 – $12^0$ సె. వద్ద నిలువ ఉంచాలి. ఇట్లా కాయలను నిలువ ఉంచవచ్చును. కావలసినప్పుడు తీసి కాయలను గడ్డిలో పెట్టి సహజంగా పండించటం కాని లేదా ఇథిలీన్ గ్యాస్ 200 వద్ద 10-12 గంలు ఉంచి కాని పండించుకోవచ్చును.

ఇట్లు వివిధ దశలలో తగు జాగ్రత్తలు తీసుకున్న రైతులు మేలైన అధిక దిగుబడితో పాటు మంచి ధరను కూడా పొందుతారు.



**డా. బి.కె.ఎం. లక్ష్మి,** ప్రధాన శాస్త్రవేత్త,
మామిడి పరిశోధనా స్థానం, నూజివీడు

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఆరోగ్యానికి దివ్య ఔషధం మునగ



దక్షిణ భారతదేశంలో పేరు పొందిన బహువార్షిక కూరగాయల్లో మునగ ఒకటి. పెరటి తోటల్లో పెంచే ఈ పంట ప్రస్తుతం వాణిజ్య పరంగా పండించబడుతోంది. కాయలతో పాటుగా మునగ ఆకులు వైద్యపరంగా ఉపయోగిస్తున్నారు. చెట్టు వేరు నుండి ఆకు వరకు అన్నీ ఉపయోగాలే. పోషకాలు కూడా ఎక్కువే. మునగ కాయలే కాకుండా ఆకులు కూడా చాలా బలమైన ఆహారం. బాక్టీరియా, శిలీంధ్ర, కీటక సంహారిగా దీనిని ఉపయోగిస్తారు. ఎరువుగా కూడా దీన్ని ఉపయోగిస్తారు. వేర్లు, ఆకులు, కాయలు, విత్తనాలు వైద్యంలో ఉపయోగిస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రయోగాల, పరిశోధనల ఫలితంగా తక్కువ వ్యయంతో మునగ విత్తనాలతో నీటిలోని బ్యాక్టీరియాను నిర్మూ లించి, నీటిని శుద్ధి చేయొచ్చు.

## మునగ వలన ఉపయోగాలు:

మునగాకు చాలా పుష్టికరమైన ఆహారం. ఇందులో కాల్షియం, జింకు, మెగ్నీషియం పుష్కలంగా ఉన్నాయి. అంతే కాకుండా ప్రొటీన్లు కూడా అధికంగా ఉన్నాయి. మునగ కాయలు మరియు గింజలలో "ఓలికి అమ్లము" ఉండుట వలన గుండెకు ఎంతో మంచిది. మునగలో కాల్షియం అధికంగా ఉండుట వలన ఎముకలను బలపరుస్తుంది.

అధిక రక్తపోటును నియంత్రిస్తుంది. రక్తహీనతను, రేచీకటి నియంత్రిణకు మునగలోని ఇనుము, బీటాకెరోటిన్ దోహద పడుతుంది. కాలేయ సంబంధ వ్యాధులు, చర్మ సంబంధ వ్యాధులకు కూడా మునగను ఔషధాల్లో వాడుతున్నారు. అంతే కాకుండా కిడ్నీలు మరియు పిత్తాశయములో రాళ్ళు ఏర్పడకుండా తోడ్పడుతుంది. విటమిన్-ఎ పుష్కలంగా ఉండుట వలన కాన్సర్ ను నివారిస్తుంది, కంటి చూపును వృద్ధి పరుస్తుంది. నియాసిన్, రిబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్, పైరిడాక్సిన్ వంటి బి-కాంప్లెక్స్ విటమిన్లు మునక్కాడల్లోనూ సమృద్ధిగా దొరుకుతాయి. ఇవి సంక్లిష్ట పిండిపదార్థాలూ ప్రొటీన్లూ జీర్ణమయ్యేలా చేస్తాయి. నీరు చేరే ఉబ్బు వ్యాధిని, చక్కెర వ్యాధిని, రకరకాల ఇన్ఫెక్షన్ లను, మొహంపై మొటిలు మరియు మచ్చలను వృద్ధావ్య సూచనలను నియంత్రిస్తుంది. పురుషులలో శృంగార పటిమను, శుక్ర కణాల సంఖ్యను వృద్ధి చేస్తుంది. మునక్కాడలు ఎక్కువగా తినేవాళ్లలో రోగనిరోధకశక్తి ఎక్కువ. శ్వాససంబంధ సమస్యలు తక్కువ. వీటిల్లోని ప్రొటీన్లూ పీచూ కారణంగా పోషకాహార లోపమూ ఉండదు. నాడీవ్యవస్థ భేషుగ్గా పనిచేస్తుంది.

**వాతావరణం :** 20-25 సెల్సియస్ ఉష్ణోగ్రత వున్న ప్రాంతాలు అనుకూలం. 40 సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతల్లో పూత రాలిపోతుంది. మంచును, అధిక చలిని తట్టుకోలేదు.

**నేలలు :** అన్ని రకాల నేలలు అనుకూలం. అధిక సేంద్రియ పదార్థాలతో కూడినా నేలలు శ్రేష్ఠం. నేల ఉదజని సూచిక 6.0-7.5 మధ్యన వుంటే మంచిది.

**విత్తే కాలము - నాటుట :** వార్షిక మునగ ఎప్పుడు నాటిన, వేసవి ప్రారంభంల్లోనే పూతకు వస్తుంది. సెప్టెంబరులో నాటుకు అనుకూల కాలం. విత్తనాలు నేరుగా నాటుకోవచ్చును. హెక్టారుకు 625 గ్రా. విత్తనం అవసరం. నాటిన 10-15 రోజులకు మొలక వస్తుంది. 625 గ్రా. విత్తనానికి ఎజోస్పైరిల్లమ్ 100గ్రా. పట్టించాలి. 2.5మీ. x 2.5మీ. ఎడం పాటించాలి. హెక్టారుకు 1600 మొక్కలు వేయాలి. సంచులలో పెంచిన మొక్కలను (60-90 సెం.మీ. ఎత్తు) మరియు ముదురు కొమ్మలను కూడా నాటవచ్చును.

**రకాలు :** దేశవాళీ రకాలు ఎక్కువగా సాగులో వున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్రంలో జాఫ్నా, పి.కె.యం-1 రకాలు ఎక్కువగా సాగులో వున్నాయి.

**పి.కె.యం-1 :** ఏకవార్షిక రకం. మొక్క 4-6 మీ. ఎత్తు వరకు పెరిగి విత్తిన 160-170 రోజులలో పూతకు వస్తుంది. కాయ పొడవు 65-70 సెం.మీ. కాయబరువు - 150గ్రా. కాయలో గుజ్జు 70 శాతం



**దిగుబడి :** మొక్కకు

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

200-225 కాయలు. 52 టన్నులు/ హె. కార్శి తోటను మూడు సంవత్సరాలు వరకు పెంచవచ్చును.

**జాఫ్నా :** బహువార్షిక రకం. కాయ పొడవు 60-90 సెం.మీ., మెత్తని గుజ్జు, రుచికరంగా ఉంటుంది. రెండో సంవత్సరం నుండి కాపునకు వస్తుంది.

**దిగుబడి :** మొదటి రెండు సం॥లు సంవత్సరానికి చెట్టుకు 80-90 కాయలను, నాల్గవ సంవత్సరం నుండి సం॥నికి 500-600 కాయలను పొందవచ్చు.

**పి.కె.యం-2 :** ఏకవార్షిక రకం. మొక్క 4-6 మీ. ఎత్తు వరకు పెరిగి విత్తిన 180- రోజులలో పూతకు వస్తుంది. కాయ పొడవు 120 సెం.మీ. కాయబరువు 280గ్రా. కాయలో గుజ్జు 70 శాతం ఉండి గింజలు తక్కువగా ఉంటాయి. దిగుబడి: మొక్కకు 33 కిలోలు లేదా 200-225 కాయలు, 98 టన్నులు/ హె. కార్శి తోటను మూడు సంవత్సరాలు వరకు పెంచవచ్చును.

**భాగ్య :** ఈ రకం కర్నాటక ప్రాంతనికి చెందినది. కాయలు పొట్టిగా (20-30 సెం.మీ.). వార్షిక రకం.




**నేల తయారి :** నేలను 4-5 సార్లు దుక్కి వచ్చే వరకు దున్నాలి. బహువార్షిక రకాలకు 5 x 5 మీ. దూరం, ఏకవార్షిక రకాలయితే 2.5 x 2.5 మీ. దూరం వుండాలి. గుంటలు పరిమాణం 45x45x45 సెం.మీ. వుండాలి. ప్రతి గుంటకు 10కిలోల పశువుల ఎరువు 250గ్రా. వేపపిండి సూపర్ ఫాస్ఫేట్ వేయాలి.

**కొమ్మకత్తిరింపులు :** నాటిన రెండు నెలలకు 75 సెం.మీ. ఎత్తులో కొన మొగ్గ తుంచాలి. కాయలు పూర్తిగా కోయటం పూర్తియిన తర్వాత 1.0 మీ. ఉంచి మిగిలిన భాగం కత్తిరింపు చేయాలి.

**నీటి యాజమాన్యం :** విత్తనాలు మొలకెత్తే వరకు ప్రతి 3 రోజులకు నీటి తడి ఇవ్వాలి. తర్వాత 10-15 రోజులకు ఒక్కసారి నీటితడి ఇవ్వాలి.

**అంతర పంటలు :** కొబ్బరిలో అంతర పంటగా మునగ వేసుకొనవచ్చును. మునగలో బెండ, అలసంద, మిరప, ఉల్లి,




గోరుచిక్కుడు, కరివేపాకు వేసుకొనవచ్చును. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కూడా అంతర పంటలుగా వేసుకొనవచ్చును.

**ఎరువులు :** గింజలు విత్తిన 3 నెలలకు ఒకొక్క గుంటకు 100 గ్రా. యూరియా, 50 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీటిని ఇవ్వాలి. మొక్కలకు ఆరు నెలలకు ఒకసారి, 9 నెలలకు ఒకసారి 100 గ్రా. యూరియాం 50 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీరు కట్టాలి.

**దిగుబడి :** బహువార్షిక రకాలు నాటిన 8-9 నెలలకు కాపునకు వస్తాయి. మొదటి పంట మార్చి-జూన్ నెలలో, రెండవ పంట సెప్టెంబర్-అక్టోబర్ నెలలో వస్తుంది. పంట పెరిగినపుడు మొక్కకు ప్రతి సంవత్సరానికి 500-600 కాయల వరకు దిగుబడి వస్తుంది. ఏకవార్షిక మునగ రకాలు గింజలు విత్తిన 6 నెలలకే కాపుకొస్తాయి (ఫిబ్రవరిలో). రకాన్ని బట్టి ప్రతి మొక్కకు మొదటి సంవత్సరం 150-200 కాయలు, రెండవ సంవత్సరం 250-400 కాయల దిగుబడి వస్తుంది. కాయల కోసిన తర్వాత, ఒక మీటరు ఎత్తులో కొమ్మలను కత్తిరించి కార్శి పంటలు తీసుకోవచ్చు. ప్రతి కత్తిరింపునకు పైన చెప్పినట్లు ఎరువులను వాడాలి. బహువార్షిక రకాలని ఒకసారి చెట్టు ఆకారంలో కత్తిరింపు చేశాక తిరిగి 10-12 సంవత్సరాల వరకు ఎటువంటి కత్తిరింపు అవసరం లేదు. ఆ తర్వాత తోటలో కొత్త మొక్కలను నాటుకోవాలి.

**మునగ ఆకు ఉత్పత్తి :** మునగ ఆకు పచ్చిరొట్టగా, పశువుల దాణాగా, ఆకు పొడి ఆహారంగా ఉపయోగపడుతుంది. హెక్టారుకు 43-52 టన్నులు ఆకు దిగుబడి వస్తుంది. అధిక సాంద్రత పద్ధతిలో 10 సెం.మీ. x 10 సెం.మీ. లేదా 60 x 30 సెం.మీ. ఎడంలో మొక్కలు నాటి 50 సెం.మీ. ఎత్తు పెరిగిన తర్వాత 15-20 సెం.మీ. కాండం ఉంచి కత్తిరించాలి. ఈ రకంగా 9 సార్లు కోయటం జరుగుతుంది. అంటే ప్రతి 40-50 రోజులకు ఒక కోత వస్తుంది 100 సెం.మీ. x 60 సెం.మీ. ఎడంలో కూడా నాటి ఆకు ఉత్పత్తి చేయవచ్చును



**శ్రీమతి డి. ప్రమీల**
డైరెక్టర్, ఆత్మ, ఆంధ్ర ప్రదేశ్

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# వేసవిలో కొత్తిమీర - లాభాలు కోరినంత మేర



ధనియాలు మన రాష్ట్రంలో పండించే ముఖ్యమైన సుగంధ ద్రవ్య పంట. ధనియాలు ప్రధానంగా అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలలో సాగు చేస్తారు. అయితే కొత్తిమీరను మన రాష్ట్రంలో అన్ని జిల్లాలలోను సాగు చేస్తున్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతాలలో నారుమళ్ళలో, వేసవిలో తప్ప దాదాపు సంవత్సరం పొడవునా కొత్తిమీరను సాగు చేయవచ్చును. శాస్త్రీయ పద్ధతిలో సాగు చేసి, వేసవిలో కూడా కొత్తిమీరను లాభసాటిగా పండించే అవకాశం ఉంది. విత్తిన 35-55 రోజులలో కొత్తిమీరను కోసి మార్కెట్ చేసుకోవచ్చు.

**కొత్తిమీర-ఆవశ్యకత :** కొత్తిమీరను పంటలలో సువాసన, రుచి పెంపొందించడానికి విరివిగా వాడుతారు. కొత్తిమీరలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు, సువాసన నూనెలు, విటమిన్లు, పీచు పదార్థాలు ఉన్నాయి. కొత్తిమీర ఎన్నో సుగుణాలు కలిగిన ఆరోగ్య ప్రదాయినిగా గుర్తించబడినది. 100 గ్రాముల కొత్తిమీరలో ఈ క్రింది పోషకాలు లభిస్తాయి.

| పోషకము | పరిమాణము | పోషకము | పరిమాణము |
|---|---|---|---|
| తేమ | 87.9 % | ప్రోటీన్లు | 3.3 గ్రా |
| పీచు పదార్థాలు | 1.2 గ్రా | పిండి పదార్థాలు | 6.5 గ్రా |
| కొవ్వు పదార్థాలు | 0.6 గ్రా | ఖనిజ లవణాలు | 1.7 గ్రా |
| కాల్షియం | 0.14 గ్రా | ఇనుము | 0.01 గ్రా |
| విటమిన్-ఎ | 10460 ఐయు | విటమిన్-కె | 360 మి.గ్రా |
| విటమిన్-సి | 135 గ్రా | విటమిన్-బి | 60 మి.గ్రా |

మనం నిత్యం ఆహారంగా తీసుకునే కూరగాయలలో విటమిన్-కె, విటమిన్-ఎ, విటమిన్-సి అధిక పాళ్ళలో కలిగిన కూరగాయలు అరుదు. ఈ మూడు విటమిన్ లు అధిక పరిమాణంలో కలిగిన ఆకుకూర పంటగా కొత్తిమీరను చెప్పవచ్చు. ఎముకల ధృడత్వాన్ని పెంపొందించేందుకు, అల్జీమర్స్ (మతిమరుపు) తగ్గించడంలోను, రక్తం గడ్డకట్టుటకుదోహదపడే లక్షణాలుకల విటమిన్-కె కొత్తిమీరలో పుష్కలంగా లభ్యమవుతుంది. కంటి చూపును పెంపొందించే విటమిన్-ఎ, వ్యాధి నిరోధక శక్తిని ఇచ్చే విటమిన్-సి కూడా అధిక మోతాదులో ఉంటాయి. కొత్తిమీర వాడటం వలన చెడు కొలెస్ట్రాల్ చాలా వరకు తగ్గుతుంది. ఇంతేకాక కొత్తిమీరకు కిడ్నీలను శుభ్రం చేసే ఔషధగుణం ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల కాలంలో మారుతున్న జీవన శైలి, ఆరోగ్యము పట్ల పెరుగుతున్న శ్రద్ధ వలన కొత్తిమీర వాడడానికి చాలా ప్రాముఖ్యత వచ్చింది.

**సాగు-యాజమాన్య పద్ధతులు :** వేసవిలో పండించే ఆకుకూరలలో కొత్తిమీర మంచి లాభదాయకమైన, గిరాకీ ఉన్న పంట. అయితే వేసవిలోని అధిక ఉష్ణోగ్రతలను, కాంతిని కొత్తిమీర తట్టుకొనలేదు. పైగా అధిక నేల ఉష్ణోగ్రతలు మొలకశాతాన్ని తగ్గించి, మొక్క ఎదుగులను నిరోధిస్తాయి. ఈ అవరోధాలను అధిగమించినప్పుడే వేసవిలో కొత్తిమీర సాగు లాభదాయకంగా ఉంటుంది.వేసవిలో కొత్తిమీరకు నీడ ఎంతో అవసరము. చెట్ల నీడలో లేదా తాటాకు పందిరి క్రింద లేదా షేడ్ నెట్ల క్రింద సాగు చేయడం ద్వారా అధిక ఉష్ణోగ్రత, అధిక కాంతి వంటి ఇబ్బందులను అధిగమించ వచ్చును. అయితే ఈ మూడింటిలో, షేడ్ నెట్ల క్రింద సాగులో దిగుబడులు అధికంగా ఉంటాయి. ఈ నెట్లలో 50 శాతము, 75 శాతము షేడ్ నెట్లు కొత్తిమీర సాగుకు మిక్కిలి అనుకూలము. వేసవిలో కొత్తిమీర సాగుకు వాడిన నెట్లను తరువాత ఖరీఫ్ ఇతర కూరగాయల నారు పెంపకానికి వాడదలచిన రైతులు 50 శాతము షేడ్ నెట్లను ఎంచుకోవచ్చును. అయితే కేవలం వేసవిలో కొత్తిమీరను వ్యాపార సరళిలో సాగుచేయదలచిన వారు 75 శాతము షేడ్ నెట్లను ఎంపిక చేసుకోవాలి. అంతేకాక నెట్ హౌస్, పాలీ హౌస్ లలో కూడా 50 లేదా 75 శాతము షేడ్ నెట్లను ఉపయోగించి వేసవిలో కొత్తిమీర సాగుచేయవచ్చు.

**అనుకూలమైన రకాలు :** డా. వై. యస్ .ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయము, ఉద్యాన పరిశోధనా స్థానం, లాం, గుంటూరు లోని అఖిల భారత సుగంధ ద్రవ్యాల సమన్వయ పరిశోధనా పథకం వారు విడుదల చేసిన సింధు సాధన, స్వాతి, సుధ, ఎపిహెచ్

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

యు ధనియా–1 సుగుణ రకాలు వేసవి సాగుకు అనుకూలమైనవి. 2017లో విడుదలైన ఎల్.సి.సి–234(సురుచి) మంచి సువాసన గల అధిక దిగుబడులనిచ్చు ఆకు రకము. 50% షేడ్ నెట్ల కింద, వేసవిలో వాణిజ్య సరళిలో ఆకు సాగుకు అనుకూలమైన రకము.

**విత్తన మోతాదు:** వేసవిలో మొలక శాతం తక్కువగా ఉంటుంది. కాబట్టి విత్తనం అధిక మోతాదులో వాడవలసిన అవసరం ఉంటుంది. విత్తనం అధిక మోతాదులో వాడినప్పుడు మొక్కలు ఎక్కువగా ఉండి ముందుగా ఎదిగిన మొక్కలను తొలిసారి కోతలో తీసుకొనే అవకాశం ఉంటుంది. ఒక సెంటు మడికి (40 మీటర్ల పొడుగు, 1 మీటరు వెడల్పు, 6 అంగుళాల ఎత్తు) 250 గ్రా. విత్తనం అవసరం అవుతుంది. ఎకరాకు 25 కిలోల విత్తనం అవసరము.

**విత్తన శుద్ధి :** అధిక సాంద్రతలో విత్తనం వేయడం జరుగుతుంది. కాబట్టి, కొత్తిమీరను మాగుడు తెగులు ఆశించి పంట నష్టపోయే అవకాశం ఉంటుంది. ఈ తెగులు ఆశించకుండా విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. ఒక కిలో విత్తనాన్ని 1 గ్రా. కార్బండిజమ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ తో విత్తే రెండు మూడు రోజుల ముందు శుద్ధి చేసుకోవాలి. జీవనియంత్రకాలయిన సూడోమోనాస్ లేదా ట్రైకోడెర్మాలతో కూడా విత్తన శుద్ధి చేసుకోవచ్చు. ఈ జీవనియంత్రకాలతో విత్తనశుద్ధి చేయని యెడల, మళ్ళతయారీ సమయంలోకాని లేదా విత్తుకొన్న తరువాత కాని



ఎకరాకు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి లేదా సూడోమోనాస్‌లను బాగా చివికిన పశువుల ఎరువు లేదా వానపాముల ఎరువుతో కలిపి పైపాటుగా మళ్ళపై చల్లుకోవాలి.

**విత్తే విధానం:** వేసవిలో అధిక దిగుబడి పొందాలంటే, కొత్తిమీరను ఎత్తయిన మళ్ళలో (3 అడుగుల వెడల్పు 6 అంగుళాల ఎత్తు, తగినంత పొడవు) విత్తుకోవాలి. వేసవిలో విత్తేటప్పుడు, విత్తనాన్ని ఒక సెంటిమీటరు లోతులో పడేటట్లు సూచించిన మోతాదులో విత్తుకోవాలి. బద్ద చేసిన విత్తనాన్ని తయారయిన మళ్ళపైవరుసలలో కాని లేదా చల్లుకొనే పద్ధతిలో కాని విత్తుకోవాలి. బాగా చివికిన పశువుల ఎరువుల లేదా వానపాముల ఎరువును 8 భాగాలు మెత్తని మట్టితో కలిపి విత్తిన మళ్ళపై సెంటిమీటరు మందంలో విత్తనం పూడేటట్లు చల్లాలి. తరువాత మళ్ళను వారం రోజులపాటు లేదా విత్తనం మొలక ప్రారంభమయ్యే వరకు వరిగడ్డితో కప్పాలి.

**ఎరువుల యాజమాన్యము :** ఎకరాకు 10 టన్నుల చొప్పున పశువుల ఎరువుతోపాటు రసాయనిక ఎరువులను ఆఖరిసారి మళ్ళను దంతితో తిరుగద్రోలేటప్పుడు వేసుకోవాలి. ఇందుకు సెంటు మడికి 350 గ్రా. ల యూరియా, 1 కిలో సింగిల్ సూపర్ ఫాస్పేట్ మరియు 150 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను వేసుకోవాలి. పశువుల ఎరువుతోపాటు అందుబాటులో ఉన్నట్లయితే వానపాముల ఎరువును వాడుకోవచ్చును. విత్తిన ఇరవై రోజులకు జిబ్బరెల్లిక్ ఆమ్లము (0.1 గ్రా 10 లీ. నీటికి) పిచికారీ చేసినట్లయితే మొక్క ఎదుగుదల బాగుంటుంది.

**నీటి యాజమాన్యము :** వేసవి సాగులో నీటి యాజమాన్యము మొక్కల ఎదుగుదల మరియు దిగుబడిని నిర్ధేశిస్తుంది. సరైన నీటి యాజమాన్యము వలన, నేల ఉష్ణోగ్రతలు తగ్గడమే కాకుండా మొక్కల మధ్య ఏర్పడ్డ సూక్ష్మ వాతావరణం మొక్కలు వడలిపోకుండా కాపాడుతుంది. వేసవి గాలుల వలన, ఎత్తయిన మళ్ళ మీద సాగు చేయడం వలన అవసరాన్ని బట్టి రోజుకు రెండు లేదా ఎక్కువ సార్లు తడపవలసి వస్తుంది. వీలైనంత వరకు మళ్ళను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో తడపాలి. అవసరానికి మించి తడిపినట్లయితే తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది. పందిరి క్రింద సాగుచేసినప్పుడు పందిరి తడపడం వలన మంచి ఫలితం ఉంటుంది.

---

**కె. నీలిమ, డా. పి. నాగిరెడ్డి, టి.స్వామి చైతన్య, ఎస్. రామలక్ష్మి దేవి, డా. ఎ. వీరయ్య,** కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, కడప

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# మొక్కలపై రసాయన మందుల ప్రభావం

మొక్కలపై రసాయనిక మందులను అధిక మోతాదులో పిచికారి చేసినప్పుడు మొక్కలకు విషపూరితంగా మారి హాని కలుగుతుంది దానినే ఫైటోటాక్సిక్అనిఅంటారు. ముఖ్యంగా హెర్బి సైడ్లు (కలుపు మందులు) మొక్కలకు ప్రమాదకరం ఎందుకంటే హెర్బి సైడ్లను కలుపు మొక్కలను చంపడానికి లేదా అణచివేయడానికి రూపొందించారు. కనుక హెర్బి సైడ్లను పిచికారి చేసే సమయంలో తగు జాగ్రతలను పాటించాలి. హెర్బి సైడ్ల వల్ల కలిగే ఫైటో టాక్సిక్ ప్రభావాలు స్ప్రే బిందు ద్వారా, నేల అవశేషాల ద్వారా లేదా ఆవిరి రూపంలో సున్నితమైన మొక్కలకు హాని కలుగజేస్తాయి. హెర్బి సైడ్లు కలుపు మొక్కలను లక్ష్యంగా చేసుకొని, వాటిని చంపడానికి లేదా అణిచివేయడానికిరూపొందించినవి. నీటి ద్వార లేదా మట్టి ద్వార లేదా నేలలో non selective అంటే అన్ని రకాల కలుపు మరియు పంట మొక్కలపై విష ప్రభావం చూపే కలుపు మందులను పిచికారి చేసిన వెంటనే ప్రధాన మొక్కలను నాటడం ద్వారా మొక్కలకు హాని కలుగతాయి.

కలుపు మందుల మోతాదు బట్టి లేదా కాలుష్య స్థాయిని బట్టి పంటలకు హాని కలుగతాయి. ఉదా : ప్రత్తిలో అధిక మోతాదులో 2,4 డి కలుపు మందును పిచికారి చేసినప్పుడు ప్రత్తి పంటపై ఎనేషన్మోజాయిక్ వైరస్ వంటి లక్షణాలను గమనిస్తాము. చిన్న తరహా రైతులు పురుగు మందులను, తెగుళ్ళ మందులను, కలుపు మందులను మరియు పోషకాలను పిచికారి చేయడానికి ఒకే స్రేయర్‌ను వాడుతారు. కలుపు మందులను పిచికారి చేసిన తరువాత సరిగా శుభ్రం చేయకుండా వాడితే టాంక్ లో మరియు నాజిల్ లో మిగిలిపోయి ఉన్న కలుపు మందుల అవశేషాలు ఉన్న స్ప్రేయర్ ను మళ్ళీ అదే స్ప్రెయర్ ను సున్నితమైన పంటలపైన ప్రత్తి, ద్రాక్ష మరియు తీగ జాతి కూరగాయల పంట పై పిచికారి చేసినప్పుడు మొక్కలకు హాని కలుగుతాయి.

కలుపు మందులే కాకుండా పురుగు మందులు/తెగుళ్ళ మందులు/నెమటిసైడ్లు (నూలి పురుగు మందులు) లను అధిక మోతాదులో వాడినప్పుడు మొక్కలకు హాని కలుగుతాయి. పురుగు మందుల వల్ల కలిగే ఫైటో టాక్సిక్ అనేది ఫార్ములేషన్ (నీటిలో కరిగే పొడి, ఎమల్సిఫై బుల్ కాన్ సెంట్రేట్, గుళికల మొదలగునవి) పై ఆధారిపడి ఉంటుంది . మందులను అధిక మోతాదులో పిచికారిచేసినప్పుడు ఆకులు కాలిపోయినట్లు లేదా



గోధుమ రంగుకి మారటం లేదా మొక్క పూర్తిగా చనిపోవడం వంటి లక్షణాలను గమనించవచ్చు. కొన్ని సార్లు ఆకులు, కాండం, పూత మరియు కాయులు ఆకారం మార్పు చెంది వక్రీకృతమైతుంది. ఫైటోటాక్సిసిటీ అనేది ఫార్ములేషన్ లోని ద్రావకాల వలన, పిచికారి చేయవలసిన మందు ద్రావణంలో మలినాల ద్వారా కాని లేదా రసాయనిక మందులను నీటిలో సరిగా కలపక పోవడం ద్వారా కాని మొక్కలకు హాని కలుగుతాయి.

బెట్టకు గురైన మొక్కలపై అధిక మోతాదులో రసాయనిక మందులను పిచికారి చేయడం ద్వారా మొక్కలకు ఎక్కువ హాని జరిగే అవకాశం ఉంటుంది. ఉష్ణోగ్రత, తేమ మరియు కాంతి వంటి పర్యావరణ పరిస్థతులు ఫైటోటాక్సిసిటిని ప్రభావితం చేస్తాయి. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు పిచికారి చేయడం ద్వారా పురుగు మందుల క్షీణత మరియు అస్థి రతను వేగవంతం చేస్తాయి. కొన్నిసార్లు మొక్కలకు కూడా హాని కలుగజేస్తాయి.

అతినీలలోహిత వికిరణం (UV radiations) వల్ల కూడా పురుగుమందులను చాలా వేగంగా విచ్ఛిన్నం చేస్తుంది. నేల అల్లిక /రచన, నేల తేమ, నేలలో ఉన్న సూక్ష్మ జీవులు మరియు నేల ఉదజని సూచిక వంటి లక్షణాలు కూడా ఫైటోటాక్సిసిటిని పెంచుతుంది. బెట్టకుగురైన మొక్కలపై అధిక మోతాదులో రసాయనిక మందులను పిచికారి చేయకూడదు. అధిక ఉష్ణోగ్రతల వద్ద (>32°C) రసాయనిక మందులను పిచికారి చేయకూడదు. ఉష్ణోగ్రతలు చల్లగా ఉన్నప్పుడూ ఉదయాన్నే లేదా సాయంత్రం

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



పూట పిచికారి చేయడం మంచిది. నీటిలో కరిగే పొడి మందులు మొక్కలకు సురక్షితమైనవిగాచెప్పవచ్చును.

- డైక్లోరోవాస్, ఫెనిట్రోథియాన్, క్వినాల్ఫాస్, మోనోక్రోటో ఫాస్, కాపర్ ఆక్సీక్లోరైడ్, మిథైల్డెమెటాన్, మరియు డైమిథోయేట్ వంటి మందులు అధిక మోతాదులో వాడితే జొన్న పంటకు హాని కలిగిస్తాయి.
- ప్రత్తి పంటలో అధిక మోతాదులో కలుపు మందులను వాడకూడదు.
- సల్ఫర్ వంటి రసాయనిక మందులుఅధిక మోతాదులో వాడితే దోసకాయ పంటకు హాని కలిగిస్తాయి.
- అధిక మోతాదులో వాడితే ప్రొఫెనొఫాస్ ఉల్లి పంటకు మరియు చామంతి వంటి పూల మొక్కలకు హాని కలిగిస్తాయి.



- అధిక మోతాదులో ప్రోపికోనజోల్పిచికారి చేయడం వల్ల మిరప పంటకు హానికారం
- మొక్కజొన్నలో ఎక్కువ మోతాదులో ప్రొఫెనొఫాస్ ను పిచికారి చేయడం మొక్కలకు హానికరం
- కరివేపాకు పంటపై సల్ఫర్ వంటి మందులు పిచికారి చేయడం వలన ఆకులు రాలిపోవడం వంటి సమస్యలు ఎక్కువ అవుతాయి.

**యమ్. జాహ్నవి, డా. ఎన్ వి వి ఎస్ దుర్గా ప్రసాద్, డా . జి . రమేష్,** కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి

## కందిలో అధిక దిగుబడులనిస్తున్న స్వల్పకాలిక హైబ్రిడ్ వంగడాలు

పప్పు ధాన్యాలలో కంది కీలకమైనది. మొత్తం పప్పుల వాడకంలో ఒక్క కంది వాటాయే సుమారు 40% ఉంటుంది. కంది దీర్ఘకాలిక పంట. పంట కాలం 180 రోజులు. మన దేశంలో కందిని ఎక్కువగా వర్షాధారంగానే సాగు చేస్తారు. దేశ వ్యాప్తంగా ఏటా వర్షాలు తగ్గుతూ, సాగునీరు సమస్యాత్మకం కానున్న తరుణంలో కంది దిగుబడుల పెంపు శాస్త్రవేత్తలకు సవాలుగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు తక్కువ పంటకాలం కలిగి అధిక దిగుబడుల నిచ్చే హైబ్రీడ్ (సంకర) వంగడాల సృష్టిపై ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. ఈ దిశగా గత ఐదేళ్ళుగా వారు చేసిన ప్రయోగాలు క్షేత్ర స్థాయిలో సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఐ.సి.పి. హెచ్.-2433, ఐ.సి.పి. హెచ్.-2431, ఐ.సి.పి. హెచ్.-2439, ఐ.సి.పి. హెచ్.-2438 వంటి హైబ్రిడ్ కంది వంగడాలు స్థిరమైన అధిక దిగుబడులు నమోదు చేస్తున్నాయి. ప్రస్తుతం కంది పంటలో సగటు దిగుబడులు ఎకరాకు 300 నుంచి 340 కిలోల వరకు నమోదవుతుండగా ప్రయోగాత్మక హైబ్రిడ్ వంగడాలు 560 నుండి 640 కిలోల వరకు దిగుబడులు ఇస్తున్నాయి. పైగా ఈ నూతన వంగడాలు 130 నుండి 140 రోజులలో పంట చేతికందడం విశేషం. కంది సాగుకు అంతగా అనువు కాని ప్రాంతాలలో కూడా ఇవి మేలైన ఫలితాన్నిస్తున్నాయి. దీంతో సమీప భవిష్యత్తులో కంది సాగు అంతగా లేని ప్రాంతాలలో ఈ పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయి. ఈ పరిణామం ముఖ్యంగా చిన్న సన్నకారు రైతులకు అధిక ప్రయోజనం కానుంది.

“చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి.”

# చామంతి - లాభాల విరిబంతి



చామంతి మన రాష్ట్రంలో 2,511 హెక్టార్లలో సాగవుతూ 22,670 టన్నుల వార్షిక దిగుబడిని ఇస్తున్నట్లుగా అంచనా వేశారు.

**ప్రాముఖ్యత ఉపయోగాలు :** ఇది ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో వాణిజ్యపరంగా పెరిగే అత్యంత అందమైన పురాతనమైన పుష్పించే పూల మొక్క. అంతర్జాతీయ మార్కెట్‌లో కట్‌ఫ్లవర్, కుండీ మొక్కగా ఇది ముఖ్యమైనది. డచ్ కట్ ఫ్లవర్ వేలంలో రోజా పువ్వు తర్వాత రెండవ స్థానంలో ఉంది. విస్తృత శ్రేణి రంగులు, ఆకారాలు, పువ్వుల పరిమాణాలు, సుదీర్ఘమైన పుష్పించే జీవితం బెట్టను తట్టుకొనే సామర్థ్యం, ఏడాది పొడవునా సులభంగా పెరగడం వంటి వాటి కారణంగా ఈ పంట ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన సాంప్రదాయ పూల పంటలలో ఒకటి. దీనిని ప్రధానంగా కాడ కత్తిరింపబడిన పువ్వుగా, కుండీలలో పెట్టిన మొక్కగా మరియు పెరటి తోటల్లో బోర్డరు మొక్కలుగా ఉపయోగిస్తారు. పైరెత్రిన్ క్రిమిసంహారక మందుల తయారీకి ఉపయోగిస్తారు. కొన్ని జాతుల ఆకులను పుస్తకాలలో బుక్‌మార్క్‌గా ఉపయోగిస్తారు. మరికొన్ని జాతుల తాజా ఆకులను సలాడ్ మరియు సూప్‌లలో ఉపయోగిస్తారు.



**పసుపు పూల రకాలు :** బసంతి, కో-1, ఎల్లో గోల్డ్, పూనమ్ మరియు రాయచూర్ (హైదరాబాద్ వరకర ప్రాంతాల్లో సాగుచేసే రకాలు).

**తెలుపు పూల రకాలు :** రత్లామ్ సెలక్షన్, ఐ.ఐ.హెచ్.ఆర్-6, పి.ఎ.యు.బి-107, పూర్ణిమ

**ఎరుపు పూల రకాలు :** రెడ్ గోల్డ్, కో-2

వాతావరణ మరియు నాటే సమయం : చామంతి మొక్కలు పగటి సమయం ఎక్కువగా ఉన్నప్పుడు శాఖీయంగా మాత్రమే పెరుగుతాయి. పగటి సమయం తక్కువగా ఉండి రాత్రి సమయం ఎక్కువగా ఉంటే చామంతిలో పూత బాగా ఏర్పడుతుంది. అందుకొరకు మన రాష్ట్రంలో జూన్-జూలై మాసాల్లో నారు మొక్కలను నాటినట్లయితే నవంబర్-డిసెంబర్ మాసాల్లో పూస్తాయి.

**నేలలు :** తేలికపాటి నేలలు అనుకూలం. ఉదజని సూచి 6.5-7 మధ్య ఉండాలి. మురుగు నీటి పారుదల సరిగా లేని ఎడల మొక్కలు చనిపోతాయి.

**ప్రవర్ధనం :** పిలకలు, కొమ్మ కత్తిరంపుల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. పూల కోతలు అయిన పిమ్మట ఫిబ్రవరి-మార్చి నెలలందు మొక్కల నుంచి పిలకలను కత్తిరించి నారుమడిలో నాటుకోవాలి. మొక్కలని కొమ్మ కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేసుకుంటే మొక్కలు ఆరోగ్యంగా వుండి పూల నాణ్యత బాగుంటుంది. వేర్లు తొడిగిన పిలకల్ని జూన్-జూలై మాసాలలో నాటుకోవాలి. తల్లి మొక్క నుండి లేత కొమ్మల చివరి భాగాన్ని కత్తిరించుకోవాలి. సుమారుగా 5-7 సెం.మీ. పొడవుతో పూర్తిగా విచ్చుకున్న మూడు ఆకులను మాత్రమే ఉంచి మిగతా ఆకులను తీసివేసి, ఈ కత్తిరింపులను నారుమడులలో నాటుకోవాలి.

**నాటటం మరియు ఎరువులు :** మొక్కలను 30×30 సెం.మీ. ఎడంగా నాటుకోవాలి. ఎకరాకు 55,000 నుండి 60,000 మొక్కలు అవసరమవుతాయి. నాటుటకు ముందు ఒక ఎకరాకు 10 టన్నుల బాగా చివికిన పశువుల ఎరువు 60-80 కిలోల నత్రజని, 30-40 కిలోల భాస్వరం మరియు 60-80 కిలోల పొటాష్ నిచ్చే ఎరువు వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం :** వాతావరణాన్ని బట్టి మరియు నేల తీరు బట్టి తడి ఇవ్వాలి. నాటిన మొదటి నెలలో వారానికి 2-3 సార్లు, అటు పిమ్మట వారానికి ఒకసారి తడి ఇవ్వాలి.

**ఊతమివ్వటం :** చామంతి మొక్కలు పూలు పూచేటప్పుడు బరువుకి వంగిపోకుండా వెదురు కర్రతో ఊతమివ్వడం మంచిది.

తలలు తుంచటం (పించింగ్) : నారు నాటిన నాలుగు వారాల తరువాత చామంతి మొక్కల తలలను తుంచి వేయాలి. ఈ విధంగా చేయడం వలన ప్రక్క కొమ్మలు ఎక్కువగా వస్తాయి. దీనివలన

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

పూల దిగుబడి అధికంగా వస్తుంది. పంట కూడా కొంత ఆలస్యంగా వస్తుంది.

**హార్మోన్ల వాడకం :** 100 పి.పి.యమ్. (100 మి.గ్రా.లను లీ. నీటిలో) నాఫ్తలిన్ ఎసిటిక్ ఆమ్లాన్ని మొగ్గదశ కంటే ముందుగా పిచికారీ చేస్తే పూతను కంత ఆలస్యం చేయవచ్చు. 100-150 పి.పి.యమ్. జిబ్బరెల్లిక్ ఆమ్లాన్ని పిచికారీ చేస్తే 15-20 రోజుల్లో త్వరగా పూతకొస్తుంది.

**పూలకోత :** జూన్-జూలైలో నాటిన మొక్కలు నవంబరు నుంచి జనవరి వరకు పూతపూసి కోతకొస్తాయి. ఒక పంట కాలంలో దాదాపు 10-15 సార్లు పూల కోయవచ్చు. ఎకరాకు దాదాపు 5 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తుంది. పూలకోత తరువాత చామంతి మొక్కలను నేలకు దగ్గరగా కత్తిరించి తడి ఇచ్చి కొంత వరకు సేంద్రీయ ఎరువులను వేసినట్లయితే కత్తిరించిన భాగం నుంచి పిలకలు వచ్చి వాటిని మరలా నాటుకోడానికి ఉపయోగపడతాయి. అలా కాకుండా పంట తీసేసే ముందు కొమ్మ కత్తిరింపులను తీసుకొని నారుమడిలో పెట్టుకోవచ్చు. నారుమడిలో పెట్టే ముందర కొమ్మ కత్తిరింపులకు కార్బం డిజమ్ 1 గ్రా. ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావ ణంలో ముంచి నారుమడిలో నాటుకోవాలి. కత్తిరింపులకు వేర్లు బాగా రావాలంటే ఐ.బి.ఎ. 2500 పి.పి.యం. ద్రావణంలో కాని సెరాడెక్స్‌లో కాని ముంచి నారుమడిలో నాటుకోవాలి.



**సస్యరక్షణ :** చామంతి పంటకు ముఖ్యంగా పచ్చపురుగు, ముడత మరియు ఆకు తొలుచు పురుగులు ఎక్కువగా నష్టం కలుగచేస్తాయి.

**ఆకుముడత :** ఈ పురుగు ఆశించిన ఆకులపై సొరంగాలవలె చారలు ఏర్పడుతాయి. దీని ఉధృతి అధికంగా ఉంటే ఆకులు ఎండిపోతాయి. నివారణకు 0.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.3 గ్రా. ఎసిటామిప్రిడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



**పేనుబంక :** అన్ని రకాల దశల పురుగులు పువ్వుల్ని మరియు మొగ్గల్ని ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయి. నివారణకై మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పచ్చపురుగు :** ఈ గొంగళి పురుగులు ఆకులను మరియు పువ్వులను కూడా తిని నష్టపరుస్తాయి. నివారణకు మిథైల్ పెరాథియాన్ 1 మి.లీ. లేదా కార్బరిల్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీతో నివారించవచ్చు.

**తామర పురుగులు :** ఇవి గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు ముడతలు పడి ఎండిపోతాయి. పూలు కూడా వాడిపోయి రాలుతాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదక ఫ్రిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**ఆకుమచ్చ తెగులు :** నల్లటి లోతైన గుండ్రటి మచ్చలు ఆకులపై ఏర్పడటం వల్ల ఆకులు ఎండి వడలిపోతాయి. నివారణకు మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**వేరుకుళ్ళు తెగులు :** మొక్కలు అకస్మాత్తుగా వడలిపోతాయి. ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. భూమిలో నాటిన కటింగులు కుళ్ళిపోతాయి. దీని నివారణకు మురుగునీరు నిలువకుండా ఏర్పాటు చేయాలి. బ్లైటాక్స్ 3 గ్రా. లేదా కాప్టాన్ 2.5 - 3 గ్రా. లీటరు నీటిలో కలిపిన మందుతో నేలను బాగా తడిపి తెగులును అరికట్టవచ్చు. 2 కిలోల ట్రైకోడెర్మా పశువుల ఎరువుతో కలిపి చివరి దుక్కిలో వేయాలి.

---



**డా. ఎ.వి.డి. దొరాజీరావు, బి. లక్ష్మీ శ్రావణి,** డా. వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయము, వెంకటరామన్న గూడెం

"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# శనగ కోత-నిల్వలో జాగ్రత్తలు

రబీలో అధిక విస్తీర్ణంలో సాగుచేసే ముఖ్యమైన అపరాల పంట శనగ. పంట కోత నుంచి మళ్ళీ విత్తుకునే వరకు విత్తనాలను సంరక్షించుకోవడంలో విత్తన నిల్వ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సమయంలో విత్తన మొలక శాతాన్ని, జీవశక్తిని, విత్తన ఆరోగ్యాన్ని చాలా జాగ్రతగా కాపాడాల్సి ఉంటుంది. నిల్వ సమయంలో విత్తనాలను అంతర్గతంగా బాహ్యంగా కీటకాలు, శిలీంధ్రాలు ఆశించి నష్టపరుస్తాయి. కనుక పంటను సరైన సమయంలో కోయడం ముఖ్యం. కోత సమయంలో అధిక తేమ ఉన్నట్లయితే శిలీంధ్రాలు మరియు కీటకాలు ఆశించే అవకాశం ఉంది. కావున, రైతులు పంట పక్వదశను గుర్తించి సకాలంలో పంటకోత చేసి కోతానంతరం, తదుపరి నిల్వ సమయలో తగు జాగ్రతలు పాటిస్తే అధిక నాణ్యవంతమైన పంట దిగుబడి పొందవచ్చు.

**కోత, నూర్పిడి :** శనగ పంట సాధారణంగా పూతదశ నుండి 50-55 రోజులలో పరిపక్వతకు చేరుతుంది. కాయలు ఆకుపచ్చరంగు నుండి గోధుమ రంగుకు మారి, ఆకులు పసుపు బారి, పూర్తిగా రాలిపోయి, మొక్కంతా ఎండిపోతుంది. ఈ సమయంలో సకాలంలో కోత కోస్తే గింజ అధిక నాణ్యతను కలిగి ఉంటుంది. పంటను కూలీలు/ కంబైండ్ హార్వెస్టర్ తో కూడా కోయించవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ సామర్ధ్యం కొరకు యంత్రాల్ని వాడాలి. వాడేముందు యంత్రాల్ని శుభ్ర పరుచుకుంటే కల్తీల్ని నిరోధించవచ్చు. పంట కోసిన తరువాత గింజలు తగినంతగా ఎండు వరకు ఆరబెట్టాలి. నూర్పిడి యంత్రాలలో కాని, చేతితో గాని నూర్పుకోవచ్చు.

**విత్తనం నిల్వచేయు సమయంలో చెడిపోవడానికి గల ముఖ్య కారణాలు :**

- విత్తనంలో తేమ శాతం అధికంగా ఉండటం
- నిల్వచేసిన గదిలో తేమ, ఉష్ణోగ్రత అధికంగా ఉండటం
- పూర్తిగా శుభ్రం చేయకుండా విత్తనాలను నిల్వచేయడం
- నిల్వ సమయంలో వివిధ రకాలైన కీటకాలు మరియు బూజు తెగుళ్ళు ఆశించడం వలన విత్తన నాణ్యత మరియు మొలక శాతం తగ్గడం జరుగుతుంది.

కీటకాలు : నిల్వలో వివిధ కీటకాలు ఆశించి గింజలోపల, వెలుపల భాగాలను నష్టపరుస్తాయి. వీటి వలన నాణ్యత పోషక విలువలు తగ్గి మార్కెట్ కి పనికిరావు.

శనగ నిల్వలో పెంకుపురుగు అత్యధికంగా నష్టపరుస్తుంది. సాధారణంగా కాయ పరిపక్వత దశలోనే పంటపొలంలో పెంకుపురుగు ఆశించి గింజల ద్వారా నిల్వ చేసే గోదాములోకి ప్రవేశించి నష్టం కలుగజేస్తుంది. కాబట్టి కోత మొదలైనప్పటి నుండి నిల్వ చేసేంత వరకు తగిన జాగ్రతలు తీసుకోవాలి. పెంకుపురుగు గింజల పై గుండ్రని, తెల్లని గ్రుడ్లను పెడుతుంది. ఈ గ్రుడ్ల నుండి వచ్చిన పిల్ల పురుగులు (గ్రబ్స్) గోధుమ రంగులో ఉండి గింజ లోపలి భాగాన్ని తినేసి రంధ్రాలను చేస్తాయి. ఇందులోనే గ్రబ్స్ కోశస్థ దశలోనికి మారి, అందులో నుండి తల్లి పురుగులు బయటకు వస్తాయి.

**నివారణ:** పురుగు ఆశించకుండా గోనె సంచులను 10 శాతం వేప ద్రావణం పిచికారీ చేసి వాడుకోవాలి లేదా 5% వేప కషాయంలో ముంచి ఆరబెట్టిన గోనెసంచులను వాడాలి లేదా సంచుల పై డెల్టామిత్రిన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి తరువాత ఆరబెట్టి నిల్వ ఉంచుకోవాలి. బస్తాలు నిల్వచేసే గది గోడలపైన, క్రింద 20 మి.లీ. మలాథియాన్ ద్రావణం లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. గోదాములలో కాని, మనుషులు సంచారానికి దూరంగా ఉన్న రూములో నిలువ ఉంచినట్లైతే అల్యూమినియం ఫాస్ఫైడ్ (సెల్ఫాన్) టాబ్లెట్లను టన్ను విత్తనానికి 3గ్రా. (ఒక టాబ్లెట్) చొప్పున 5 రోజులు పాటు ఊదర పెట్టి తర్వాత గాలి తగలనివ్వాలి.

**శిలీంధ్రాలు :** పంట ఉత్పత్తిని సరిగ్గా ఆరబెట్టకపోయినా లేదా నిల్వ సమయంలో ఉత్పత్తి చెమ్మగిల్లినా లేదా కీటకాలు, ఎలుకలు ఉన్నా వివిధ శిలీంధ్రాలు ఆశించి గింజల పై తెల్లటి, పచ్చని లేదా నల్లటి బూజుగా ఏర్పడతాయి. దీని వలన గింజలు నాణ్యత, రంగు, రుచిని కోల్పోతాయి. ఈ శిలీంధ్రాలు

మైకోటాక్సిన్ అనే విషపూరిత రసాయనాలను గింజలలో విడుదల చేస్తాయి. ఈ గింజలు మనుషులు, పశువులకు హానికరమే కాక క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు దారితీస్తాయి.

తెల్లటి బూజు ఆశించిన శనగ గింజలు నల్లటి బూజు ఆశించిన శనగ గింజలు

**నివారణ :** గింజలలో తేమశాతం 9 కన్నా ఎక్కువ ఉండకుండా ఆరబెట్టాలి. నిండిన బస్తాలు చెక్క బల్లల పై వరుసలలో పేర్చి తేమ తగలకుండా జాగ్రత్త వహించాలి.

విత్తనం కొరకు భద్రపరిచే గింజల్ని థైరామ్/ కాప్టాన్ 2.5 గ్రా. కిలో విత్తనానికి చొప్పున కలిపి అరబెట్టుకుని నిల్వ చేసుకోవాలి.

**ఎలుకలు :** ఎలుకలు నిల్వ చేసిన గింజల్ని తినడంతో పాటు వాటి విసర్జనలు, మూత్రంతో గింజల్ని మలినం చేస్తాయి. తద్వారా గింజల నాణ్యత తగ్గిపోయి తినడానికి పనికిరావు.

**నివారణ :** గోదాములలో రంధ్రాలు లేకుండా మూసేయాలి. ఎరలు/బోన్లు సహాయంతో వాటిని నాశనం చేయాలి. నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు. గోదామును శుభ్రంగా ఉంచాలి. విత్తనం నిల్వ ఉంచే గోదాములలో పగుళ్ళు, రంధ్రాల్ని పూడ్చి సున్నం వేస్తే దాగి ఉన్న పురుగులు/ కీటకాలు చనిపోతాయి. పాత సంచులు వాడే ముందు 1 లీటరు నీటికి 100 మి.లీ. వేపద్రావణం కలిపి పిచికారీ చేసి వాడుకోవాలి లేదా 5% వేప కాషాయంలో ముంచి ఆరబెట్టిన తరువాత విత్తనాన్ని నింపుకోవాలి. నిల్వ ఉన్న పాత బస్తాలలో కలుపరాదు. నింపిన బస్తాలను నేల పైనే కాకుండా కొంచం ఎతైన చెక్క బల్లల పై ఏర్పాటు చేయాలి. రైతులు ఉత్పత్తి నిల్వ చేసేటప్పుడు, తగిన ధర రావడానికి గింజలలో తేమశాతం ఎప్పటికప్పుడు గమనించి మధ్యలో ఆరబెట్టకుంటూ గింజల్ని నిల్వ చేసుకున్నప్పుడు మార్కెట్ కి అనువైన నాణ్యత ప్రమాణాలు క్షీణత ఉండకుండా రైతులు మార్కెట్ లో అధిక ధర లభించి నష్టం జరుగకుండా ఉంటుంది.









**కె. నీలిమ, టి.స్వామి చైతన్య, ఎస్. రామలక్ష్మి దేవి,**
**డా. ఎ. వీరయ్య,** కే.వి.కే ఊటుకూరు, కడప

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# పట్టు పరిశ్రమలో యాంత్రీకరణ ప్రాధాన్యత - ప్రయోజనాలు



ఇటీవలి కాలంలో పట్టు పరిశ్రమ రంగంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అందులో ముఖ్యంగా యాంత్రీకరణ పద్ధతులు ఒకటి. ఈ యాంత్రీకరణ పద్ధతుల ద్వారా పట్టు పరిశ్రమలో గణనీయంగా ఖర్చులు తగ్గడమే కాక ఎక్కువ లాభాలు పొందవచ్చు.

ప్రభుత్వం ఆర్.కె.వి.వై, సిల్క్ సమగ్ర వంటి స్కీమ్స్ ద్వారా రైతులకు యాంత్రీకరణ పరికరాలు కొనుగోలు ఏర్పాటుకు సబ్సిడీల ద్వారా చేయూత ఇస్తోంది.

**ఇవీ లాభాలు... :** కూలీల కొరతను అధిగమించవచ్చు. కూలీల ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ పనిని పూర్తి చేయవచ్చు. అనావృష్టి సమయాలలో పంటలను కాపాడుటలో యాంత్రీకరణ పద్ధతులు బాగా ఉపయోగపడతాయి. తోట నుండి అధిక ఆకు దిగుబడిని పొందవచ్చు. మంచి నాణ్యత కలిగిన మల్బరీ ఆకును



పొందవచ్చు. తద్వారా మంచి నాణ్యత గల పట్టు గూళ్ళు పొందవచ్చు. పట్టు గ్రుడ్లను అధిక సంఖ్యలో పొందవచ్చు.

**యాంత్రీకరణ పద్ధతులు :** 1) మల్బరీ సాగులో యాంత్రీకరణ 2) పట్టు పురుగుల పెంపకంలో యాంత్రీకరణ

**మల్బరీ సాగులో యాంత్రీకరణ :** మల్బరీ సాగులో యాంత్రీకరణ ఎంతో ముఖ్యమైనది, ఎందుకనగా నాణ్యమైన పట్టుగూళ్ళను ఉత్పత్తి మరియు దిగుబడికి మల్బరీ ఆకు నాణ్యత 35% పైన ప్రభావితము చూపుతుంది. నాణ్యమైన మల్బరీ ఆకు దిగుబడిలో యాంత్రీకరణ అతిముఖ్యమైనది. మల్బరీ తోట కోసం దుక్కిదున్ని నేలను తయారీకి, మల్బరీ నారు మొక్కల పెంపకం, బెడ్స్ తయారీలో, అంతర సేద్యం కొరకు, మల్బరీ కొమ్మలను మేత కొరకు కత్తించుటలోను, నీటి పారుదల కొరకు ఉపయోగిస్తారు.







యస్. షాజిదా బేగం, పి. అర్జునరావు,
పట్టు పరిశ్రమల కార్యాలయం, గుంటూరు

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు :

1. రామాంజనేయులు, మర్రికొమ్మదిన్నె గ్రా., ఎన్.పి.కుంట మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 8790966893.

ప్ర. వేరుశనగ పంటలో ఆకు పైభాగాన గుండ్రని ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడ్డాయి. నివారణ తెలపండి?

జ. ఇది వేరుశనగలో వచ్చే తిక్కా ఆకుమచ్చ తెగులు. ఈ తెగులును తట్టుకొనే రకాలైన కదిరి హరితాంధ్ర, లేపాక్షి, కదిరి అమరావతి లను సాగు చేయాలి. నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా మాంకోజెబ్ 2 గ్రా. ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

2. రమేశ్, ఉల్చాల గ్రా., కర్నూలు మం., కర్నూలు జిల్లా, ఫోన్: 8977224582.

ప్ర. రబీ మొక్కజొన్న పంటలో పురుగు కాండాన్ని తొలిచేస్తున్నది. మొవ్వ చనిపోయి,ఎండిపోతోంది. నివారణ చెప్పగలరు?

జ. అంతర పంటగా అపరాలు సాగుచేయడం, జొన్నను ఎర పంటగా 4 వరుసల్లో పంట చుట్టూ వేసుకుంటే పురుగును అరికట్టగలం. కాండం తొలుచు పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లి. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లి. ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

3. మురళి కృష్ణ, బొవినివారిపాలెం గ్రా., చీరాల మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 8186891172.

ప్ర. వరిలోని వెన్ను మెడ భాగం వద్ద విరిగి కంకులు వాలిపోతున్నాయి? నివారణ తెలుపగలరు?

జ. వరి పంటలో మెడ విరుపు తెగులు ఆశించినది. నివారణకు ఐసోప్రోథియోలిన్ 1.5 మి.లి. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లి.ను లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయాలి.

4. శ్రీనివాస్, ముదునూరు గ్రా., ఉయ్యూరు మం., కృష్ణా జిల్లా, ఫోన్ : 9494456123 .

ప్ర. మినుములో పల్లాకు తెగులు ఎక్కువగా ఉన్నది. నివారణకు ఏమి చేయాలో చెప్పగలరు?

జ. మినుములో పల్లాకు తెగులు ఉన్నట్లైతే ముందుగా తెగులు ఆశించిన మొక్కలను పెరకివేసి కాల్చేయాలి. తెల్లదోమ ద్వారా ఈ తెగులు వ్యాప్తిచెందుతుంది కనుక ఎసిఫేట్ 1 గ్రా. లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఎకరానికి 40 పసుపు మరియు నీలి రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి.

5. యస్.కె. లోకేశ్వర రెడ్డి, పైసాంపల్లి గ్రా., వీరపనాయనిపల్లి మం., వై.యస్.ఆర్. కడప జిల్లా, ఫోన్ : 9490364468.

ప్ర. నువ్వులు పంటలో గొంగళి పురుగులు ఆకులను తింటున్నాయి. నివారణ తెలియజేయగలరు?

జ. ఆకులలో గూడు కట్టుకొని ఉన్న గొంగళి పురుగులను ఏరి నాశనం చేయాలి. ప్రొఫెనోఫాస్ 2 మీ.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లెదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

6. డి. సింహాచలం, శంబర గ్రా., మక్కువ మం., విజయనగరం జిల్లా, ఫోన్ : 9989980198.

ప్ర. చెరుకు కార్శి తోటలలో దుబ్బుల నుండి పిలకలు ఎక్కువ వస్తున్నాయి మరియు మొవ్వు నల్లని కొరడాగా మారుతుంది. నివారణ తెలుపగలరు?

జ. చెరుకు పంటలో కొరడా లేదా కాటుక తెగులు ఆశించినది. నివారణకు టెబుకొనజోల్ 1 మీ.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మీ.లీ. ను లీటరు నీటిలో కలిపి మందును కార్శి చేసిన వెంటనే ఒకసారి,మరో 30-35 రోజులకు ఇంకొకసారి పిచికారి చేయాలి.మందు ద్రావణం పిచికారి చేసే ముందు తెగులు సోకిన దుబ్బులను తీసి తగులబెట్టాలి.

7. సుదర్శన్, పెదవంగాలి గ్రా., చాగలమర్రి మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9010732203.

ప్ర. సజ్జ పంటలో వెడల్పాకు కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నాయి. ఏ కలుపు మందులను వాడాలి?

జ. నివారణకు ఎకరానికి 2,4-డి సోడియం సాల్ట్ 400 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

8. నిరంజన్, కొర్లపూడి గ్రా., కోట మం., నెల్లూరు జిల్లా, ఫోన్: 7731082580.

ప్ర. వేరుశనగ పంటలో ఆకులు పసుపుపచ్చగా మారుతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ. వేరుశనగలో పచ్చదోమ ఆశించినది. నివారణకు డైమిథోయేట్ 2 మీ.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

## ఉద్యాన శాఖ :

1. రూప, చిన్నొబ్బి గ్రా., కుప్పం మం., చిత్తూరు జిల్లా, ఫోన్ : 8328405946.

**ప్ర. క్యాబేజీలో లేత ఆకుపచ్చ రంగు ఆకు తినే పురుగు కనిపిస్తోంది. నివారణ చర్యలు తెలుపగలరు?**

జ. ఇది క్యాబేజీ పంటలో వచ్చే రెక్కల పురుగు (డైమెండ్ బాక్క్ మాత్). నివారణకు వేప కషాయం 5 మి.లి. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకుంటే వాటి గుడ్లను నాశనం చేయవచ్చు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే నోవాల్యురాన్ 1 మి.లి. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లి.ను లీటరు నీటికి చొప్పున కలిపి కోతకు 15 రోజుల వ్యవధి ఉంటేనే పిచికారి చేయాలి.

2. సి.హెచ్. స్వామి నాయుడు, వంతలమామిడి గ్రా., పాడేరు మం., విశాఖపట్నం జిల్లా, ఫోన్ : 9494546444

**ప్ర. జీడి మామిడి లేత చిగుర్లు మరియు పూత ఎండిపోయి రాలిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?**

జ. జీడిమామిడి పంటలో టీ -దోమ ఆశించినది. నివారణకు లీటరు నీటికీ 1.6 మి.లీ. మోనోక్రోటోఫోస్ కలిపి పిచికారీ చేసుకోవాలి. రెండవ పిచికారి పూత వచ్చిన తరువాత లామిడాసైహాలోత్రిన్ 0.6 మీ.లీ. లేదా క్లోరిపైరిఫోస్ 2 మీ.లీ.ను లీటరు నీటికీ కలిపి పిచికారీ చేయాలి.

3. జి. మంజునాధ రెడ్డి, కురాలపల్లె గ్రా., రొద్దం మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 9182550669

**ప్ర. లిల్లీ (ట్యూబరోస్)లో దుంప కుళ్లిపోతోంది మరియు మొలకలు మాడిపోతున్నాయి. నివారణ తెలియజేయగలరు?**

జ. లిల్లీ పంటలో దుంపకుళ్లు నివారణకు కార్బండజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి దుంప మొత్తం తడిచేటట్టు మొదల్లో పోసుకోవాలి.

4. శ్రీనివాసులు, క్రొత్తపల్లి గ్రా., కొత్తపల్లి మం., కర్నూలు, ఫోన్: 8008843042.

**ప్ర. నిమ్మ మొక్కలు వేసి 9 నెలలవుతోంది. పిండినల్లి ఎక్కువగా ఉంది. నివారణ తెలపండి?**

జ. నిమ్మలో పురుగు ఆశించిన కొమ్మలను కత్తిరించి కాల్చివేయాలి. పిండి నల్లి ఎక్కువగా ఉన్నట్లైతే లీటరు నీటికి డైమిథోయేట్ ఏ 2 మి.లి.తో పాటు జిగురు 0.5 మి.లి.ను కలిపి చొప్పున పిచికారి చేసుకోవాలి. కలుపు నివారణా చర్యలు చేపట్టాలి.

5. వి. యేదుకొండలు, గొల్లవిడిటి గ్రా., యెర్రగొండపాలెం మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 8465805430.

**ప్ర. మల్లె తోటలో పురుగు మొగ్గలను తొలుస్తుంది. నివారణ చెప్పగలరు?**

జ. మల్లె తోటలో మొగ్గ తొలుచు పురుగు నివారణకు క్వినాల్ఫాస్ 2 మి.లి. లేదా ప్రొఫెనొఫాస్ 2 మి.లి.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

6. దినకర్ చౌదరి, కదిరి మంగళం గ్రా., విడమలపేట మం., చిత్తూరు జిల్లా, ఫోన్ : 9392830321

**ప్ర. జామ పంటలో కాయలు కుళ్లిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. జామలో పండు ఈగ ఆశించిన పళ్లను ఏరి నాశనం చేయాలి. పిందె దశ దాటిన నుండి మిథైల్ యూజినాల్ ఎర (మిథైల్ యూజినాల్ 2 మి.లి. మలాథియాన్ 2 మి.లి.ను లీటరు నీటికి కలపాలి)లను 6-8 చొప్పున ఎకరానికి అమర్చాలి. పండు ఈగ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతేలీటరు నీటికి 100 గ్రా. బెల్లం లేదా పులిసిన గంజి మరియు 5 మి.లి. మలాథియాన్ కలిపి మట్టి పాత్రల్లో పోసి తోటల్లో అమర్చుకోవాలి.

7. ఎన్. వెంకటరమణ, కాల్వ గ్రా., ఓర్వకల్లు మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9948860201.

**ప్ర. మామిడిలో పూత మాడిపోయి రాలిపోతోంది. నివారణకు ఏమి పిచికారి చేయాలి?**

జ. మామిడిలో తేనేమంచు పురుగు ఆశించినది. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 మి.లీ. మరియు వేపనూనె 1 మి.లి. లీటరు నీటికి చొప్పున కలుపుకొని కొమ్మలు, మొదళ్ళు తడిసేటట్లుగా పిచికారి చేసుకోవాలి.

8. వెంకటేష్, సీతారాంపురం గ్రా., బేతంచర్ల మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9000363660

**ప్ర. చామంతిలో ఆకులు పైకి ముడుచుకుంటున్నాయి. పురుగు ఉంది. నివారణ తెలుపగలరు?**

జ. చామంతిలో తామర పురుగుల నివారణకు ఫిప్రోనీల్ల 2 మి.లి. లేదా డైమిథోయేట్ 2 మి.లి.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. ఎకరాకీ 40 చొప్పున పసుపు, నీలి జిగురు అట్టలను అమర్చుకోవాలి.

9. పరశురాముడు, బిలహరి గ్రా., హాలహర్వి మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 6303851004.

**ప్ర. వేసవి కాలంలో కూరగాయలు వేద్దామని అనుకుంటున్నాను. ఏ సమయాల్లో వేసుకోవచ్చో తెలుపగలరు?**

జ. వేసవికాలంలో నీటి సదుపాయముంటే కూరగాయలు పండించవచ్చు. బెండను జనవరి 15-ఫిబ్రవరి చివరివరకు, వంగ నారును ఫిబ్రవరి-మార్చి వరకు నాటుకోవచ్చు, తీగజాతి కూరగాయలను జనవరి 15-ఫిబ్రవరి వరకు విత్తు కోవచ్చు.


10. ఎమ్. కుమార్ రాజు, హస్తవరం గ్రా., రాజంపేట మం., వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ఫోన్ : 9966046638

**ప్ర. అరటిలో ఆకులకు రంధ్రాలు ఉన్నవి. నివారణ తెలియజేయగలరు?**

జ. అరటిలో లద్దె పురుగు ఆశించింది. నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154



1. రాంబాబు, కొత్తకుంటాం గ్రా., లావేరు మం., శ్రీకాకుళం జిల్లా, ఫోన్ : 8309602113

**ప్ర. ప్రత్తి పంటలో కాయల పై రంధ్రాలు ఉన్నాయి. నివారణ తెలపండి?**

జ. ప్రత్తిలో గులాబీ రంగు పురుగు ఆశించినది. నివారణకు క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.



2. నాగేష్, V. కోట గ్రా., V. కోట మం., చిత్తూరు జిల్లా, ఫోన్ : 9703680531

**ప్ర. ఆలుగడ్డలో వేరుకుళ్ళు తెగులు ఆశించింది. నివారణ తెలపండి ?**


జ. ఆలుగడ్డలో వేరుకుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కలు మొదలు దగ్గర వేర్లు కూడా తడిచేలా పొయ్యాలి.



3. సుంకరి రమేష్, గోశానపల్లి గ్రా., ధోన్ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9441946153

**ప్ర. క్యారెట్ పంటలో ఆకులు పసుపు బారుతున్నాయి. నివారణ తెలుపగలరు?**


జ. క్యారెట్ పంటలో రసం పీల్చే పురుగులు నివారణకు డైమెథోయేట్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లి. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.



4. గుడిపాటి శ్రీకాంత్, గోశానపల్లె గ్రా., డోన్ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 7382496886

**ప్ర. ఫ్రెంచ్ చిక్కుడులో ఆకులపై ఎర్రటి మచ్చలు కనిపిస్తున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. ఫ్రెంచ్ చిక్కుడులో ఆకుమచ్చ తెగులు మరియు తుప్పు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా.ను ఒక లీటరు నీటికి కలిపి మొక్కలు పూర్తిగా తడిసేటట్లుగా తెగులు ఉధ్రుతి తగ్గేంతవరకు వారం రోజుల వ్యవధితో 2 సార్లు మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.




5. పి. శ్రీనివాసులు, కేసమినేనిపల్లె గ్రా., కలువాయి మం., నెల్లూరు జిల్లా, ఫోన్ : 9848612382

**ప్ర. వంగ పంటలో ఆకులు మరియు మొగ్గలలో పురుగు ఉంది. నివారణ తెలపండి?**

జ. వంగ పంటలో ముక్కు పురుగు (ఎపిలాక్నా బీటిల్) ఆశించినది. నివారణకు థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. ను లీటరు నీటికి కలిపి 7 రోజుల వ్యవధితో మార్చి మార్చి పురుగు ఉధ్రుతి తగ్గేంతవరకు 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

6. హరిబాబు, బ్రహ్మసముద్రం గ్రా., కాట్రేనికోన మం., తూర్పుగోదావరి జిల్లా, ఫోన్ : 8184943863



**ప్ర. జీడి మామిడిలో గొంగళి పురుగులు ఆకులను, కొమ్మల చివర్లను కొరికి తింటుంది. నివారణ తెలుపగలరు?**

జ. జీడి మామిడి లో గొంగళి పురుగులు ఆశించినవి. నివారణకు క్లోరోఫిన్ ఫైర్ 2 మీ.లీ. లేదా క్లోరాంట్రోనిలిప్రోల్ 0.3 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి



7. కె. గోపీచందు, రాపూరు గ్రా., రాపూరు మం., నెల్లూరు జిల్లా, ఫోన్ : 8142448130

**ప్ర. వరి పంటలో సుడిదోమ నివారణ తెలపండి?**


జ. వరిలో సుడి దోమ ఆశించినది. నివారణకు డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా. లేదా పైమెట్రాజన్ 0.6 గ్రా. ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

8. జగదిష్, వ్యాసాపురం గ్రా., ఉరవకొండ మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 9347910957



**ప్ర. శనగ పంటలో ఆకులపై తుప్పు మచ్చలు ఉన్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. శనగ పంటలో తుప్పు తెగులు ఆశించింది. నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ. లేదా హెక్సకోనజోల్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.



9. సురేష్ నాయుడు, పెద్దపలవేడు గ్రా., బి. కంద్రిగ మం., చిత్తూరు జిల్లా, ఫోన్ : 9989706556

**ప్ర. కాకరలో కాయలు పసుపుబారి కుళ్ళిపోయి, రాలిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?**

జ. కాకరలో పండు ఈగ ఆశించింది. పండు ఈగ నివారణకు మిథైల్ యూజినాల్ 2 మి.లి. వెనిగర్, పంచదార ద్రావణంను లీటరు నీటికి కలిపి 10 ఎరలు ఎకరాకి ఏర్పాటు చేయాలి.

10. వెంకట రావు, గోసం గ్రా., రణస్థలం మం., శ్రీకాకుళం జిల్లా, ఫోన్ : 9704978859



**ప్ర. బీర పంటలో కాయలు వంకర్లు తిరుగు పోతున్నాయి.నివారణ తెలపండి?**

జ. పండు ఈగ నివారణకు మిథైల్ యూజినాల్ ఏ 2 మి.లి. వెనిగర్, పంచదార ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి 10 ఎరలు ఎకరాకి ఏర్పాటుచేయాలి.

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

1. విప్పర్ల రామయ్య, భూమనపల్లె గ్రా., దొనకొండ మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 8688671014.

**ప్ర. కంది పైరుపై పూత, పిందెలు, కాయలు వృద్ధి దశలలో ఉన్నప్పుడు మారుక మచ్చల పురుగుకు నివారణ తెలపండి?**

జ. కందిలో మారుక మచ్చలపురుగు నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.3 మి.లీ.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని వారం వ్యవధితో 2 సార్లు పిచికారి చేయవలెను.

2. ఎమ్. నారాయణ స్వామి, మోపిడి గ్రా.,ఉరవకొండ మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 9505496297

**ప్ర. వేసవిలో అనువైన, తక్కువ పంట కాలం కలిగిన కొర్ర రకాలను తెలుపగలరు?**

జ. 80-85 రోజులు కాల పరిమితి కలిగిన కృష్ణ దేవరాయ, నరసింహ, శ్రీలక్ష్మి వేసవిలో అనువైన రకాలు.

3. డేవిడ్ రాజు, పంచలింగాల గ్రా., కర్నూలు మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9676028211

**ప్ర. మినుము పంట ఆకులు అక్కడక్కడా పసుపుబారి ఎండిరాలి పోతున్నాయి. నివారణ తెలపండి?**

జ. మినుములో పల్లాకు తెగులు ఆశించినది. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా.ను ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చెయ్యాలి. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది కనుక పసుపు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున అమర్చుకోవాలి.

4. వెంకటేశ్వర్లు, కొండబిట్రి కుంట గ్రా., బోగోల్ మం., ఎస్.పి. ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా, ఫోన్ : 8686686640

**ప్ర. వరి పంట వెన్నుల్లో పూత పసుపు రంగు ముద్దలా ఏర్పడు తున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. వరిలో మాని పండు తెగులు నివారణకు కార్బెండజిమ్ 1 గ్రా. లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పొట్ట దశలో మరియు వెన్నులు పైకి వచ్చే దశలో సాయంత్రం పూట పిచికారి చేయవలెను.

5. ప్రతాప్, నూలివీడు గ్రా., గాలివీడు మం., కడప జిల్లా, ఫోన్: 7337532762

**ప్ర. పుచ్చ పంటలో పెంకు పురుగులకు నివారణ తెలపండి ?**

జ. పుచ్చలో పెంకు పురుగులు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లి.ను లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయవలెను.

6. ఆవుల శ్రీనివాసరావు, అగ్రహారం గ్రా., జగ్గయ్యపేట మం., కృష్ణా జిల్లా, ఫోన్ : 9849863887

**ప్ర. టమాటా పంటలో ఆకులు ఎండిపోతున్నాయి. నివారణ తెలపండి?**

జ. టమాటా పంటలో ఆకుమాడు తెగులు ఆశించినది. నివారణకు క్యాప్టాన్ 3 గ్రా. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. మందులను లీటరు నీటికీ చొప్పున కలిపి మార్చి మార్చి పిచికారీ చేయాలి.

7. నాగేంద్రుడు, నందిపాడు గ్రా., కొమిలిగుండ్ల మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9912038351

**ప్ర. మిరపలో ఆకుపై ముడత నివారణకు ఏమి పిచికారి చేయాలి?**

జ. మిరపలో తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లి. మరియు వేపనూనె (1500 పి.పి.ఎం.) 1 మి.లి. లీటరు నీటికి చొప్పున పిచికారి చేసిన వారం రోజులకు పురుగు ఉధృతిని బట్టి డైఫెంథియురాన్ 1.25 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

8. బి. సందీప్ కుమార్ రెడ్డి, బైచగిరి గ్రా., ఆదోని మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9059200070

**ప్ర. ఉల్లి పైరుపై ఉదారంగు ఆకు మచ్చ మరియు ఎండు తెగులు ఆశించింది. నివారణ తెలపండి?**

జ. ఉల్లిలో ఉదారంగు ఆకు మచ్చ మరియు ఎండు తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా ఫోసిటైల్ 2.5 గ్రా. మరియు 0.5 మి.లీ. జిగురు పదార్థంతో ఒక లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలు పూర్తిగా తడిసేటట్లుగా పిచికారీ చేసుకోవాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."




# రైతుల స్పందన

కుసుమ పంటలో పేనుబంక నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు డైమిథోయేట్ 2 మి.లి. ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు ఉధృతి తగ్గింది. మంచి సలహా ఇచ్చిన రైతు సమాచార కేంద్రం వారికి ధన్యవాదాలు.

నారాయణ రెడ్డి, పెద్దరంగాపురం గ్రా., పులివెందుల మం., వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ఫోన్ : 8500409023.

గొర్ల నాగవర ప్రసాద్, మల్లేశ్వరం గ్రా., బంటుమిల్లి మం., కృష్ణా జిల్లా, ఫోన్ : 8309351068.

ఉలవలో కాండం మరియు వేరు కుళ్ళు నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు కార్బాప్ హైడ్రోక్లోరైడ్ 3 మి.లి. ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని మొక్క మొదలు మరియు వేర్లు తడిచేటట్లు పోశాను. ఇతర మొక్కలకు తెగులు వ్యాప్తి చెందలేదు. రైతు సమాచార కేంద్రం వారికి కృతజ్ఞతలు.

పుచ్చులో పేనుబంక మరియు ఆకుముడత నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు ఎసిఫేట్ 1.5 గ్రా.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు ఉధృతి తగ్గింది. రైతు సమాచార కేంద్రం వారికి అభినందనలు.

కె. విజయ కుమార్, సింగసముద్రం గ్రా., రామకుప్పం మం., చిత్తూరు జిల్లా, ఫోన్ : 9849406051.

గోపాల్ రెడ్డి, చింతలచెరువు, పెద్దవడుగూరు మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 9160234833.

వేరుశెనగలో ఆకు తినే పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 1 మి.లీ. ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేశాను. పురుగు తగ్గింది. రైతు సమాచార కేంద్రం వారికి ధన్యవాదాలు.

మినుములో కాండపు ఈగ నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు ఎసిఫేట్ 1.0 గ్రా. ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు తగ్గింది. రైతు సమాచార కేంద్రం వారికి కృతజ్ఞతలు.

వెంకటేశ్వర్లు, కార్వెన గ్రా., బండి ఆత్మకూర్ మం., కర్నూల్ జిల్లా, ఫోన్ : 6300950340.

కొండలరావు, కృష్ణాపురం గ్రా., తొండంగి మం., తూర్పు గోదావరి జిల్లా, ఫోన్ : 8106659832.

బత్తాయి పంటలో బూజు తెగులు నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేశాను. తెగులు ఇతర భాగాలకు సోకలేదు. పంట బాగుంది. రైతు సమాచార కేంద్రం వారికి ధన్యవాదాలు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# ఉత్తమ సేవలందిస్తున్న ఆర్.బి.కె. సిబ్బంది.



**జి. విజయకృష్ణ యాదవ్**
నరసనన్నపేట–2, నరసన్నపేట మం.,
శ్రీకాకుళం జిల్లా



**బి. విజయ్ కుమార్**
శ్రీరంగరాజపురం గ్రా.,
గజపతినగరం మం., విజయనగరం జిల్లా



**బండారు వరహాలుదొర**
కె. కోటపాడు గ్రా., కె. కోటపాడు మం.,
విశాఖపట్నం జిల్లా



**పైలా రాజా**
రేఖవానిపాలెం గ్రా., తుని మం.,
తూర్పు గోదావరి జిల్లా



**డి. సురేష్**
కొవ్వూరుపాడు గ్రా., గోపాలపురం మం.,
పశ్చిమ గోదావరి జిల్లా



**సింహాద్రి జ్యోత్స్న**
మంత్రిపాలెం గ్రా., నాగాయలంక మం.,
కృష్ణా జిల్లా



**వి. సాలెంరాజు**
ఖాజీపాలెం గ్రా., పి.వి. పాలెం మం.,
గుంటూరు జిల్లా



**శివశంకర్ నాయక్ మేఘావత్**
తిప్పాయపాలెం గ్రా.
ప్రకాశం జిల్లా



**కమ్మ శ్రీకళ**
కాట్రాయపాడు గ్రా., దగదర్తి మం.,
నెల్లూరు జిల్లా



**ఎ. రాచయ్య**
వై.ఎన్. పాలెం గ్రా., టి.సుండుపల్లి
మం., కడప జిల్లా



**దూదేకుల బాబు**
తరిగోపుల గ్రా., జె.బంగ్లా,
కర్నూలు జిల్లా



**సాయి భార్గవ్**
బ్రహ్మసముద్రం గ్రా., బొమ్మగానిపల్లి
మం., అనంతపురం జిల్లా



**టి. నెదెంజలిన్**
ఆముదాల, పాలసముద్రం
మం., చిత్తూరు జిల్లా



# వేసవి సేద్యం - రైతుకు అదనపు ఆదాయం

## వేసవి పంటలు - బెట్టను తట్టుకునే రకాలు





### మినుము

L.B.G. 787, 75-80 రో॥, 8-9 క్వి/ఎ. TBG-104 వేసవిలో మార్చిలో కూడా విత్తుకోవచ్చు



### వేరుశనగ

ICGV - 91114 - ఆఖరి దశలో బెట్టను తట్టుకుంటుంది. తక్కువ నీటి వినియోగం. గ్రీష్మ, రోహిణి, ధీరజ్ (ICGS 1073) అధిక వేడిని తట్టుకుంటుంది.



### పెసర

L.G.G. 407, 65-70 రో॥ దిగుబడి 5-6 క్వి/ఎ





### మొక్కజొన్న

బెట్ట పరిస్థితుల్లో 2% యూరియా ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేసిన బెట్టను కొంతవరకు తట్టుకుంటుంది

### కొర్ర




ప్రసాద్, శ్రీలక్ష్మి, కృష్ణదేవరాయ, నరసింహరాయ,



### రాగి

మారుతి - బెట్టను అన్ని దశల్లో తట్టుకుంటుంది 85-90 రో॥, 10-12 కి/ఎ.

చంపావతి - 80-85 రో॥, 10-12 కి/ఎ.



### సజ్జ

ICTP-8203 (కాంపోజిట్) 80-85 రో॥, 8-10 క్వి/ఎ,

PHB-3 - 80-85 రో॥, 12-14 కి/ఎ.

ABV-04 - 85-90 రో॥, 10-12 కి/ఎ.

మల్లికార్జున

### జొన్న



నంద్యాల తెల్లజొన్న-1, NTJ-1 100-105 రో॥, 12-14 క్వి/ఎ.

M-35-1, 115-120 రో॥, 10-12 క్వి/ఎ.

వ్యవసాయ శాఖ - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము